




PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 05, పేజీలు - 08

సోమవారం, జూన్ 29, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD









## ఎవడు అడ్డొచ్చినా..
# మూసీ ప్రక్షాళన చేసి తీరుతా

### - తెలంగాణ దేశంలోనే అగ్రస్థానమన్న సీఎం రేవంత్

- కేసీఆర్ కుటుంబాన్ని రాష్ట్ర ప్రజలు శాశ్వతంగా బహిష్కరించారు - కేసీఆర్ కుటుంబం పదేళ్లపాటు రాష్ట్రాన్ని దోచుకుతిన్నారు
- 30 నెలల కాంగ్రెస్ పాలనలో 70 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ చేసినట్లు వెల్లడి - తెలంగాణ సాధిస్తే ఆ త్యాగాన్ని టీఆర్ఎస్ వాళ్లు తమ ఖాతాలో వేసుకున్నారు
- ప్రక్షాళనకు ఎవడు అడ్డొచ్చినా మూసీ లేసి తొక్కుతానన్న రేవంత్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ సాధనలో మంత్రి పదవులను తృణప్రాయంగా వదిలిన కొండ లక్ష్మణ్ బాపూజీ, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వంటి వారి త్యాగాల ముందు బీఆర్ఎస్ నేతల త్యాగాలు ఎందుకూ పనికిరావని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. ఎవడు అడ్డు వచ్చినా, ఎవడు ఆత్మహత్య చేసుకున్నా మూసీ లేసి తొక్కుతా, మూసీ నది ప్రక్షాళన చేసితీరుతా అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేంద్రంలో 12 ఏళ్ల బీజేపీ పాలన, తెలంగాణలో 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలన, కాంగ్రెస్ పాలనపై అసెంబ్లీలో చర్చకు సిద్ధమా అని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు.వచ్చే ఎన్నికల్లోగా ఎస్ఎల్బీసీ, డిండి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని, మూసి నది ప్రక్షాళనకు ఎవరు అడ్డొచ్చినా వదిలేది లేదని హెచ్చరించారు. నల్లగొండలోని నాగార్జున కాలేజీ స్టేడియంలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో బీఆర్ఎస్ పార్టీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అంతకుముందు ఆయన నల్లగొండ జిల్లాలో పలు కీలక అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. రాష్ట్రంలో 2028 నుండి 2034 వరకు సైతం కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని ధీమా వ్యక్తం చేసిన సీఎం తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతానని ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ శ్రీకాంతాచారి, కానిస్టేబుల్ కృష్ణయ్య వంటి అమరవీరుల త్యాగాలను అడ్డం పెట్టుకుని, ఉద్యమం ముసుగులో గత

2లో..



## సంక్షోభ సమయంలో నా మాట విని
# పాటించారు

### - దేశ ప్రజలకు ధన్యవాదాలు చెప్పిన ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతి నెలా చివరి ఆదివారం నిర్వహించే రేడియో కార్యక్రమం మన్ కీ బాత్‌లో కీలక అంశాలను ప్రస్తావిస్తారనే సంగతి తెలిసిందే. తాజాగా 'మన్ కీ బాత్' 135వ ఎపిసోడ్‌లో ప్రస్తుతం చోటుచేసుకుంటున్న కీలక అంశాలపై జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా పశ్చిమ ఆసియాలో నెలకొన్న పరిస్థితిని ప్రస్తావిస్తూ భారత ప్రజలు సంయమనం పాటించాలని ఆయన కోరారు. ఇదివరకు తాను చేసిన విజ్ఞప్తి ప్రజల్లో ఎలాంటి ప్రభావంపై చూపిందనే దాని గురించి కూడా ఆయన వివరించారు. దేశ ప్రజలను తన విజ్ఞప్తికి మద్దతు ఇవ్వడమే కాకుండా అందుకు సహకరిస్తున్నారని మోదీ పేర్కొన్నారు. పశ్చిమాసియాలో ఇరాన్,అమెరికా–ఇజ్రాయెల్ యుద్ధం వల్ల ఏర్పడిన సంక్షోభ పరిస్థితుల నేపథ్యంలో దేశ ప్రజలకు మోదీ కీలక సూచన చేసిన సంగతి తెలిసిందే. పెట్రోల్, డీజిల్ ఆదా చేయాలని ఏడాది పాటు బంగారం కొనవద్దని, కార్‌పూలింగ్ చేయాలని ప్రధాని మోదీ ఇటీవల విజ్ఞప్తి చేశారు. రైతులు సహజమైన, రసాయన రహిత వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని, రసాయన ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలని కూడా ఆయన కోరారు. అయితే తాను చేసిన ఈ విజ్ఞప్తి ప్రభావం గురించి ప్రధాని మోదీ తన మన్ కీ బాత్ కార్యక్రమంలో చర్చించారు. "నా విజ్ఞప్తికి మద్దతు ఇవ్వడమే కాకుండా, అందుకు సహకరిస్తున్న దేశంలోని ప్రతి పౌరుడికి నేను కృతజ్ఞుడను. చాలామంది

2లో..

## బీఆర్ఎస్‌లో చేరడం అంత
# ఈజీ కాదు!




- కొందరు నేతలే పెత్తనం చేస్తున్నారనే అభిప్రాయమా.?
- చేరాలనుకునే నాయకులకు తగిన ప్రాధాన్యం దక్కడం లేదనే అసంతృప్తా.?
- ఇతర పార్టీల నుంచి రావాలనుకునే నేతల్లో సందిగ్ధత

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయి రెండున్నరేళ్లు పూర్తయింది. అయితే బీఆర్ఎస్ లో ఇప్పటి వరకూ చేరికలు లేవు. సహజంగా అధికార పార్టీపై వ్యతిరేకతతో కొందరు నేతలు ప్రతిపక్ష పార్టీలో చేరడం ప్రారంభిస్తారు. కాంగ్రెస్ తర్వాత బలమైన ప్రతిపక్షం బీఆర్ఎస్ మాత్రమే కావడంతో ఆ పార్టీలో చేరేందుకు ఇంత వరకూ ఏ నేత ముందుకు రాకపోవడం ఒకరకంగా పార్టీలో జరుగుతున్న పరిణామాలకు అద్దం పడుతుంది. బీఆర్ఎస్ లో చేరడం వల్ల తమ రాజకీయ భవిష్యత్ ఎలా ఉంటుందన్న దానిపై అనుమానాలు ఉండబట్టే గులాబీ కండువా కప్పుకోవడానికి పెద్దగా ఎవరూ ముందుకు రావడం లేదన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి.

### కొందరే పెత్తనం చేస్తుండటంతో

బీఆర్ఎస్ పార్టీ ఇంటి పార్టీగా ముద్ర పడింది. కేవలం కేసీఆర్ కుటుంబ సభ్యులే పెత్తనం చేస్తున్నారు. దీంతోపాటు

2లో..

## జగన్ ఎందుకా
# ఏడుపులు.?

- పేద పిల్లలకు మంచి భోజనం పెడుతుంటే ఏడుపా.?
- స్మార్ట్ కిచెన్లపై జగన్ ఆరోపణలను ఖండించిన మంత్రి లోకేశ్
- పేదల సంక్షేమాన్ని చూసి జగన్ ఓర్వలేకపోతున్నారని విమర్శ

2లో..



# సంతానం భారం కాదు, సంపద

### - పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు

- ఉమ్మడి కుటుంబ వ్యవస్థ పునరుద్ధరణ కావాలని ఆకాంక్షించిన చంద్రబాబు - పిల్లల పెంపకంలో తండ్రులు కూడా బాధ్యత పంచుకోవాలని సూచన
- సంతానాన్ని భారంగా కాకుండా సంపదగా చూడాలన్న ముఖ్యమంత్రి - రాష్ట్రవ్యాప్తంగా 49.20 లక్షల మంది చిన్నారులకు పోలియో చుక్కల లక్ష్యం

అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ మళ్లీ తిరిగి రావాలని, పిల్లల పెంపకం కేవలం తల్లి బాధ్యత మాత్రమే కాదని, తండ్రులు కూడా ఆ బాధ్యతను పంచుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సంతానాన్ని భారంగా చూసే ధోరణి పోయి, వారిని సంపదగా భావించే పరిస్థితి రావాలని ఆయన ఆకాంక్షించారు. జాతీయ ఇమ్యునైజేషన్ డే సందర్భంగా ఆదివారం అమరావతిలోని తన క్యాంపు కార్యాలయంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులకు స్వయంగా

2లో..




## తెలంగాణలో కమలం వికసించే రోజు
# ఎంతో దూరంలో లేదు

- బూత్ అధ్యక్షుల సమావేశంలో నితిన్ నబీన్
- 2028లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం
- బెంగాల్ తరహాలో పోరాడాలన్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు గడిచినా ఉద్యమ ఆశయాలు ఇంకా నెరవేరలేదని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అన్నారు. తెలంగాణ వేగవంతమైన అభివృద్ధిని సాధించేందుకు 'డబుల్ ఇంజిన్ ప్రభుత్వం' ఏర్పాటుకు కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నితిన్ నబీన్ మూడు రోజుల పర్యటన కోసం ఆదివారం తెలంగాణకు వచ్చారు. ఈ సందర్భంగా రంగారెడ్డి రూరల్ బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అలాగే రాష్ట్రంలోని 8 బీజేపీ కార్యాలయాలను నితీన్

2లో..



## స్తంభించిన నైరుతి రుతుపవనాలు

### - దేశంలో వర్షాభావ పరిస్థితులు

- జూన్ 28 నాటికి దేశవ్యాప్తంగా 45 శాతం వర్షపాత లోటు నమోదు
- ఖరీఫ్ సాగుపై తీవ్ర ప్రభావం, రైతాంగంలో పెరుగుతున్న ఆందోళన
- తెలంగాణలో 32 శాతం లోటు, ఏపీలో సాధారణ వర్షపాతం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) నైరుతి రుతుపవనాలు దేశంలోకి ప్రవేశించినప్పటికీ, పూర్తి స్థాయిలో వర్షపాతం నమోదు కావడంలేదు. కొన్నిరోజులు చురుగ్గా ఉంటే, మరికొన్ని రోజులు నిలిచిపోయే పరిస్థితి కనిపిస్తోంది. ప్రస్తుతం నైరుతి రుతుపవనాలు

2లో..



## తోతాపురి మామిడి రైతులను ఆదుకోవాలి

### - కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు లేఖ



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్‌లో తోతాపురి మామిడి రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభంపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి సారించారు. రైతులను ఆదుకునేందుకు తక్షణమే జోక్యం చేసుకోవాలని

2లో..



## 'ఇడుపు కాయితం' అర్థం తెలియాలంటే
# పవన్‌ను అడగండి

- తెలంగాణ యాసను రేవంత్ రెడ్డి కాపాడటం లేదని విమర్శ
- తెలంగాణ అస్తిత్వంపై దాడి జరుగుతోందని ఆవేదన

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత మరోసారి తనదైన శైలిలో సంచలన వ్యాఖ్యలు చేశారు. 'ఇడుపు కాయితం' అనే సినిమా టైటిల్‌పై జరుగుతున్న ప్రచారాన్ని ప్రస్తావిస్తూ, ఆ పదానికి అసలైన అర్థం తెలియాలంటే ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను అడగాలని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఉప్పల్‌లో తన పార్టీ జెండాను ఆవిష్కరించిన సందర్భంగా ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రియదర్శి, నాగదుర్గ ప్రధాన పాత్రల్లో తెలంగాణ నేపథ్యంలో తెరకెక్కుతున్న 'ఇడుపు కాయితం' సినిమా టైటిల్‌పై సోషల్ మీడియాలో కొద్ది రోజులుగా తీవ్ర దుమారం రేగుతోంది. ముఖ్యంగా కొందరు ఆంధ్ర నెటిజన్లు తెలంగాణ యాసను, ఈ పదాన్ని కించపరిచేలా ట్రోల్ చేస్తుండటం వివాదానికి దారితీసింది. ఈ నేపథ్యంలో కవిత స్పందిస్తూ, తెలంగాణ భాష, అస్తిత్వంపై దాడి జరుగుతున్నా కాంగ్రెస్, బీజేపీ, చివరికి సొంత

2లో..

## ఈ ఏడాది నేను బంగ్లాదేశ్‌కు
# తిరిగి వెళ్తాను

### - షేక్ హసీనా సంచలన ప్రకటన

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) తీవ్ర రాజకీయ సంక్షోభం మధ్య బంగ్లాదేశ్‌ను వీడి వచ్చి భారత్‌లో ఆశ్రయం పొందుతున్న బంగ్లా మాజీ ప్రధాని, అవామీ లీగ్ అధినేత్రి షేక్ హసీనా మొదటిసారి ఓ అంతర్జాతీయ మీడియా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగానే ఆమె మాట్లాడుతూ సంచలన కామెంట్లు చేశారు. ప్రస్తుతానికి దేశ బహిష్కరణలో ఉంటూ స్వదేశంలో మరణశిక్ష ఎదుర్కొంటున్న ఆమె ఈ ఏడాదే తన స్వదేశానికి వెళ్లిపోతానని

2లో..



## సౌదీలో ఘోర ప్రమాదం

### - హెలికాప్టర్ కుప్పకూలి 14 మంది దుర్మరణం



రియాద్ (ప్రశ్న న్యూస్) సౌదీ అరేబియాలో ఘోర హెలికాప్టర్ ప్రమాదం జరిగింది. ప్రభుత్వ రంగ దిగ్గజ చమురు సంస్థ సౌదీ అరామ్కోకు చెందిన హెలికాప్టర్ కుప్పకూలడంతో అందులో ప్రయాణిస్తున్న 14 మంది

2లో..

## ఎవడు అడ్డొచ్చినా.. మూసీ ప్రక్షాళన చేసి తీరుతా

బీఆర్ఎస్ పాలకులు ఫాం హౌజ్ పాలిటిక్స్ చేశారని దుయ్యబట్టారు. 2014లో 60 వేల కోట్లుగా ఉన్న రాష్ట్ర అప్పులను 6 లక్షల కోట్ల అప్పులపాలు చేసింది బీఆర్ఎస్సేనని విమర్శించారు. ఆ దోపిడీ దొంగతనాల్లో భాగస్వామ్యులైన వారే మళ్లీ పదవుల కోసం ఆశపడుతున్నారని, కానీ బీఆర్ఎస్ అనేది ఇక గతం అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ నాయకులను తాము రాజకీయంగా ఉప్పు పాతర వేశామని, వారిని మళ్లీ మొలవనివ్వబోమని స్పష్టం చేశారు. సూర్యాపేటలోని మూడు అడుగుల నాయకుడిని మళ్లీ అసెంబ్లీలోకి రానివ్వబోమని అక్కడి యువతే అంటున్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

### సంక్షేమం, అభివృద్ధిపై సవాల్

తెలంగాణలో తమ రెండున్నరేళ్ల పాలనతో పాటు గత 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలన, 12 ఏళ్ల బీజేపీ కేంద్ర పాలనపై, వారి మేనిఫెస్టోలపై ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేసి చర్చిద్దామని, దీనికి సిద్ధమా? అంటూ విపక్షాలకు రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. గత ప్రభుత్వంలో 5 ఏళ్లపాటు మహిళలకు క్యాబినెట్‌లో చోటే ఇవ్వలేదని, కొత్త రేషన్ కార్డులు కూడా ఇవ్వలేదని విమర్శించారు. తాము అధికారంలోకి రాగానే కొత్త కార్డులు ఇవ్వడమే కాకుండా గతంలో బర్లకు పోసిన దొడ్డు బియ్యం స్థానంలో, ఏటా 16 వేల కోట్లు ఖర్చు చేస్తూ 3 కోట్ల మందికి సన్న బియ్యం అందిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు.

### ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లు, రూ.500కే సిలిండర్

పేదవారి ఆత్మగౌరవమైన ఇందిరమ్మ ఇళ్లు ఇస్తుంటే ప్రతిపక్షాల కడుపు మండుతోందని, వాళ్లు మాత్రం వందల ఎకరాల్లో వందల కోట్లతో ఫాం హౌజ్‌లు కట్టుకోవచ్చా? అని ప్రశ్నించారు. పేదల ఇళ్లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామని, రైతు భరోసాతో అన్నదాతల కళ్లల్లో ఆనందం చూస్తున్నామని పేర్కొన్నారు. దేశంలోనే అత్యధిక వరి ధాన్యం పండిస్తున్న తెలంగాణలో నల్లగొండ జిల్లా మొదటి స్థానంలో ఉందని, ఇప్పటివరకు 80 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం సేకరించామని వెల్లడించారు. ఎస్సీ కులాల వర్గీకరణను సాకారం చేసింది కాంగ్రెస్ పార్టీయేనని గుర్తుచేశారు.

### నల్గొండ ప్రాజెక్టులు, మూసి ప్రక్షాళనపై కీలక ప్రకటనలు

గత బీఆర్ఎస్ పాలకుల పాపాల వల్లే ఎస్ఎల్బీసీ ప్రాజెక్టు వెనుకబడిందని, నల్లగొండ ప్రజలకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని సీఎం రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. వచ్చే ఎన్నికల లోపే ఎస్ఎల్బీసీ టన్నెల్, డిండి ప్రాజెక్టులను పూర్తి చేసి తీరుతామని మాటిచ్చారు. మూసి నదిని పూర్తిగా ప్రక్షాళన చేసి, ఆ కంపు నుండి నల్లగొండ బిడ్డలను కాపాడుకుంటానని స్పష్టం చేశారు. ఈ ప్రక్షాళనకు ఎవడు అడ్డు వచ్చినా మూసిలోనే తొక్కుతామంటూ హెచ్చరించారు. సింగరేణిలో టెండర్లు కాలేదని, ప్రతిపక్షాలు అబద్ధాలు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు.

## సంక్షోభ సమయంలో నా మాట విని పాటించారు

కార్‌పూలింగ్ అనుభవాలను కూడా పంచుకున్నారు. ఒకప్పుడు వేర్వేరు మార్గాల ద్వారా ఒకే వైపునకు ప్రయాణించే ప్రజలు ఇప్పుడు కలిసి ప్రయాణిస్తున్నారు. భారతీయులందరం ఈ సంక్షోభాన్ని కలిసికట్టుగా ఎదుర్కొంటున్నందుకు నాకు సంతోషంగా ఉంది. ప్రజా భాగస్వామ్యం అనే ఈ శక్తి మనల్ని బలోపేతం చేసి, విజయం సాధించేలా చేస్తుందని నేను విశ్వసిస్తున్నాను" అని మోదీ పేర్కొన్నారు."సాధ్యమైనంత వరకు ప్రజలు కొంతకాలం పాటు బంగారం కొనడం మానుకోవాలని నేను సలహా ఇచ్చాను . విదేశీ విహారయాత్రలకు వెళ్లవద్దని ప్రజలను కోరాను. కార్‌పూలింగ్‌ను ప్రోత్సహించాలని కూడా ప్రజలకు విజ్ఞప్తి చేశాను. రైతులు రసాయన రహిత వ్యవసాయాన్ని అవలంబించాలని, తమ పొలాలను కాపాడుకోవాలని, వీలైనంత వరకు సహజ ఎరువులను ఉపయోగించాలని నేను కోరాను చాలా కుటుంబాలు తమ అనుభవాలను పంచుకుంటూ నాకు సందేశాలు పంపాయి. ఈసారి కుటుంబ వివాహాలకు బంగారం కొనకూడదని చాలా కుటుంబాలు నిర్ణయించుకున్నాయి. అవసరమైతే, వారు పాత బంగారంతో కొత్త ఆభరణాలు తయారు చేయించుకుంటారు" అని ప్రధాని మోదీ వివరంగా చెప్పారు.చాలా మంది పౌరులు తమ విదేశీ ప్రయాణాలను వాయిదా వేసుకున్నట్లు సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారని కూడా ప్రధాని మోదీ పేర్కొన్నారు. కార్‌పూలింగ్‌పై అవగాహన కూడా పెరిగిందని అన్నారు. దీనివల్ల ఇంధనం ఆదా అవ్వడమే కాకుండా ట్రాఫిక్, కాలుష్యం కూడా తగ్గుతున్నాయని చెప్పారు. ప్రజలు ఇప్పుడు బస్సులు, మెట్రో వంటి ప్రజా రవాణా సౌకర్యాలను ఎక్కువగా ఉపయోగిస్తున్నారని ఇది ఒక సానుకూల మార్పుకు సంకేతమని మోదీ అన్నారు. దేశంలోని అనేక ప్రాంతాల్లో సహజ వ్యవసాయానికి, సేంద్రియ ఎరువులకు డిమాండ్ పెరిగిందని కూడా ఆయన పేర్కొన్నారు.

## బీఆర్ఎస్‌లో చేరడం అంత ఈజీ కాదు!

జిల్లాకొక నాయకుడు కనుసన్నల్లో పార్టీ ఉంది. ఆ జిల్లాలో నేతలు చేరాలంటే ముందుగా ఆ జిల్లా నేతను సంప్రదించాలి. ఒక్కో జిల్లాకు ఒక్కో నాయకుడు బీఆర్ఎస్ లో మోనార్క్ గా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. గతంలో మంత్రులుగా కేసీఆర్ కేబినెట్ లో పనిచేసిన వాళ్లు జిల్లా పార్టీపై పెత్తనం చేస్తుండటంతో వారు తమకు ఇష్టమైన వారినే పార్టీలో చేర్చుకునేందుకు సుముఖత చూపుతున్నారన్న విమర్శలు సొంత పార్టీ నుంచి వినిపిస్తున్నాయి. నేరుగా కేటీఆర్, హరీశ్ రావును కలసి పార్టీలో చేరినా జిల్లాలో పెత్తనం చేస్తున్న నాయకుడికి ఆగ్రహం కలిగితే తమకు టిక్కెట్ కూడా దక్కదన్న అభద్రతాభావంలో ఉన్నారు.

### అగ్రనాయకత్వాన్ని కలిసినా..

నేరుగా కొందరు కేటీఆర్ ను కలిసి పార్టీలో చేరినా వారిని జిల్లా రాజకీయాలకు దూరంగా ఉంచుతుండటం ఉదాహరణలుగా చూపుతున్నారు. కేసీఆర్ ను నేరుగా కలిసే ఛాన్స్ ఎటూ లేదు. కేటీఆర్, హరీశ్ రావులను కలిసి లైన్ క్లియర్ చేసుకున్నా చేరికపై జిల్లా నేతలనే సంప్రదిస్తుండటంతో చాలా మంది నేతలు పార్టీలో చేరాలని ఉన్నప్పటికీ తమకు పూర్తి స్థాయి హామీ లభించడం లేదని వెనకడుగు వేస్తున్నారు. ఇటువంటి వారంతా ఇప్పుడు బీజేపీ నేతల అభిప్రాయంలో ఉన్నారు. బీజేపీ క్రమంగా తెలంగాణలో పుంజుకుంటుండటంతో నేరుగా బీజేపీలో చేరితే తమ రాజకీయ జీవితం నల్లేరు మీద నడకలా సాగుతుందని విశ్వసిస్తున్నారు. అందుకే బీఆర్ఎస్ లో గత రెండేళ్ల నుంచి పెద్దగా చేరికలు లేకపోవడానికి కారణమని పార్టీ నేతలే అంగీకరిస్తున్నారు. ఇప్పటికైనా పార్టీ నాయకత్వం ఈ లోపాలపై దృష్టి సారించాలని కిందిస్థాయి క్యాడర్ కోరుకుంటోంది.

## జగన్ ఎందుకా ఏడుపులు..?

**అమరావతి (ప్రశ్న న్యూస్)** ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ కిచెన్ల వ్యవహారంపై ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేస్తున్న ఆరోపణలపై రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా స్పందించారు. స్మార్ట్ కిచెన్ల ద్వారా ఎవరి ఉపాధి పోదని, పైగా కొత్త ఉద్యోగాలు వస్తాయని స్పష్టం చేశారు. పేద విద్యార్థులకు రుచి, శుచితో కూడిన నాణ్యమైన భోజనం అందిస్తుంటే జగన్ ఓర్వలేకపోతున్నారని ఆయన విమర్శించారు. ఉపాధి కల్పనపై మాట్లాడుతూ "వైఎస్సార్ కడప జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా ఐదు స్మార్ట్ కిచెన్లు ఏర్పాటయ్యాయి. వాటి పరిధిలోని 233 మంది కుక్-కమ్-హెల్పర్లు యథావిధిగా తమ విధుల్లో కొనసాగుతున్నారు. త్వరలో జిల్లాలో ఏర్పాటు చేయబోయే మరో 33 స్మార్ట్ కిచెన్ల వల్ల కూడా ఏ ఒక్కరి ఉపాధికీ నష్టం వాటిల్లదు. పైగా, ఈ కిచెన్ల నిర్వహణ ద్వారా స్వయంశక్తి సంఘాల మహిళలకు అదనంగా 38 మంది హెడ్ కుక్స్, 22 మంది అసిస్టెంట్ కుక్స్, 256 మంది హెల్పర్లు, సుమారు 76 మంది డ్రైవర్లకు ఉపాధి లభించబోతోంది. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మందికి అదనపు ఉపాధి కల్పిస్తుంటే జగన్ ఎందుకు ఏడుస్తున్నారు? పేదలు బాగుపడటం ఆయనకు ఇష్టం లేదా?" అని లోకేశ్ ప్రశ్నించారు.

వేతనాల బకాయిల ఆరోపణలను కూడా లోకేశ్ తోసిపుచ్చారు. "కడప జిల్లాలోని 3,450 మంది కుక్-కమ్-హెల్పర్లకు 2026 ఏప్రిల్ నెల వరకు జీతాలు పూర్తిగా చెల్లించాం. మే నెలలో పాఠశాలలకు వేసవి సెలవులు కావడంతో గౌరవ వేతనం చెల్లింపు ఉండదు. జూన్ నెల ఇంకా పూర్తి కాలేదు. మరి జగన్ ఎవరి బకాయిల గురించి ఫేక్ ఆరోపణలు చేశారో చెప్పాలి" అని ఆయన డిమాండ్ చేశారు. స్మార్ట్ కిచెన్ల ఏర్పాటుతో విద్యార్థులకు మరింత పరిశుభ్రమైన, నాణ్యమైన భోజనం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని లోకేశ్ పునరుద్ఘాటించారు. "పేద పిల్లలకు మంచి భోజనం అందించడాన్ని కూడా, వారి ఆరోగ్యాన్ని కూడా సహించలేకపోతే ఎలా జగన్ గారూ?" అంటూ మంత్రి లోకేశ్ చురకలంటించారు.

## ట్రాలీ ఆటోను ఢీకొట్టిన లారీ..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆదివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శ్రీకాకుళం జిల్లా కవిటి మండలం జమేదారిపుట్టుగ వద్ద ట్రాలీ ఆటోను లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు మహిళలు అక్కడికక్కడే మృతి చెందారు. పలువురు గాయపడ్డారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు.గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రులకు పంపించారు. మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదంలో మృతి చెందిన వారి వివరాలు తెలియాల్సి ఉందని అన్నారు.

## సంతానం భారం కాదు, సంపద

పోలియో చుక్కలు వేశారు. అనంతరం ముఖ్యమంత్రి చిన్నారుల తల్లిదండ్రులతో ఆప్యాయంగా ముచ్చటించారు. పిల్లలను ఎత్తుకుని ఆడించారు. వారి ఆరోగ్య వివరాలు, వ్యాక్సినేషన్ షెడ్యూల్ గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల టీకాలను నిర్ణీత సమయంలో తప్పనిసరిగా వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పల్స్ పోలియో కార్యక్రమం అమలుకు చేసిన ఏర్పాట్లను కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు సీఎంకు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో 5 ఏళ్లలోపు వయసున్న సుమారు 49.20 లక్షల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన తల్లిదండ్రులతో చంద్రబాబు ప్రత్యేకంగా మాట్లాడారు. ఉద్యోగాలు చేసే మహిళలు పిల్లల పెంపకాన్ని ఎలా సమన్వయం చేసుకుంటున్నారని అడిగారు. "పిల్లల్ని కని, పెంచడం, వారి ఆలనా పాలనా చూడటం ఒక్క తల్లికి మాత్రమే పరిమితం చేయకూడదు. ఇంట్లో భర్త, ఇతర మగవాళ్లు కూడా పిల్లల పెంపకంలో బాధ్యత తీసుకోవాలి" అని ఆయన స్పష్టం చేశారు. గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉండటం వల్ల పిల్లల పెంపకంలో అందరూ భాగస్వాములయ్యేవారని గుర్తుచేశారు. పిల్లలను విలువలతో పెంచడంలో నానమ్మ, తాతయ్యలు కీలక పాత్ర పోషించేవారని అన్నారు. "ఉమ్మడి కుటుంబ వ్యవస్థ చాలా బలమైనది. అలాంటి వ్యవస్థ మళ్లీ రావాలి. సంతానాన్ని ఒక సమస్యగా, భారంగా చూసే విధానం పోవాలి. ఇప్పుడు పరిస్థితులు మారాయి. సంతానం అంటే సంపద అనే పరిస్థితి వస్తోంది. అందుకే ఇద్దరు, అంతకంటే ఎక్కువ మంది పిల్లలు ఉండేలా ప్రభుత్వ పరంగా కూడా ప్రోత్సహిస్తున్నాం" అని చంద్రబాబు వివరించారు. ఈ విషయంలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కేవీఎన్ చక్రధర్ బాబు, ఇతర ఉన్నతాధికారులు, జాతీయ ఆరోగ్య మిషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## స్తంభించిన నైరుతి రుతుపవనాలు

పూర్తిగా స్తంభించిపోయాయి. దీంతో దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. జూన్ 28 నాటికి దేశంలో 45 శాతం వర్షపాత లోటు నమోదైంది. ఇది ఖరీఫ్ సాగుపై తీవ్ర ఆందోళనకు కారణమవుతోంది. జలాశయాల్లో నీటి మట్టాలు పడిపోవడం, వేడి కారణంగా విద్యుత్ వినియోగం పెరగడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. జూన్ 4 నుంచి 28 వరకు దేశవ్యాప్తంగా సాధారణంగా 141.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 77.1 మిల్లీమీటర్ల వర్షం మాత్రమే కురిసింది. వారం క్రితం 40 శాతంగా ఉన్న లోటు ఇప్పుడు 45 శాతానికి చేరడం పరిస్థితి తీవ్రతను సూచిస్తోంది. ఉపగ్రహ చిత్రాల ప్రకారం, మధ్య, పశ్చిమ, వాయవ్య భారతదేశంలోని చాలా ప్రాంతాల్లో ఆకాశం మేఘరహితంగా ఉంది. కేవలం ఈశాన్య రాష్ట్రాలు, ద్వీపకల్పంలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రమే వర్షాలు కురుస్తున్నాయి.ముఖ్యంగా గుజరాత్‌లో 86 శాతం, మహారాష్ట్రలో 60 శాతం వర్షపాత లోటుతో పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. మధ్యప్రదేశ్ (42 శాతం), ఉత్తరప్రదేశ్ (59 శాతం), బీహార్ (52 శాతం), ఒడిశా (53 శాతం), కర్ణాటక (47 శాతం) రాష్ట్రాల్లోనూ తీవ్ర వర్షాభావం నెలకొంది. తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే, తెలంగాణలో 32 శాతం లోటు నమోదు కాగా, ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి మెరుగ్గా ఉండి సాధారణ వర్షపాతం నమోదైనట్టు నివేదికలు చెబుతున్నాయి. వాతావరణ నిపుణుల ప్రకారం, ఇది 'బ్రేక్-లైక్ ఫేజ్' అని, తేమతో కూడిన గాలులు బంగాళాఖాతం, ఈశాన్య రాష్ట్రాలకే పరిమితమై దేశంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించడం లేదని చెబుతున్నారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో రుతుపవనాలు బలహీనంగా ఉంటాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ముందుగానే అంచనా వేసింది. రాబోయే రోజుల్లో రుతుపవనాలు పుంజుకోవడం ఖరీఫ్ పంటలకు అత్యంత కీలకం. దేశంలోని మెజారిటీ ప్రాంతాలు రుతుపవనాల క్రియాశీలత కోసం ఆశగా ఎదురుచూస్తున్నాయి.

## తోతాపురి మామిడి రైతులను ఆదుకోవాలి

కోరుతూ కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలో రైతులు తీవ్ర నష్టాల్లో ఉన్నారని, కేంద్రం అండగా నిలవాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కిచెప్పారు. అంతర్జాతీయంగా నెలకొన్న ప్రతికూల మార్కెట్ పరిస్థితుల కారణంగా మామిడి గుజ్జు (పల్ప్) ఎగుమతులు పూర్తిగా నిలిచిపోయాయని చంద్రబాబు తన లేఖలో వివరించారు. దీని ప్రత్యక్ష ప్రభావంతో స్థానిక మార్కెట్లలో తోతాపురి మామిడి ధరలు ఒక్కసారిగా కుప్పకూలాయని, దీంతో రైతులు పెట్టిన పెట్టుబడి కూడా రాక తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే సహాయం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో సుమారు 7.03 లక్షల మెట్రిక్ టన్నుల తోతాపురి మామిడిని రైతుల నుంచి సేకరించేందుకు రూ. 281 కోట్లు ఆర్థిక సహాయంగా మంజూరు చేయాలని కోరారు. దీంతో పాటు, మార్కెట్ ధరకు, గిట్టుబాటు ధరకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని భర్తీ చేసేలా ప్రత్యేకంగా 'ధరల వ్యత్యాస చెల్లింపు పథకం' అమలు చేయాలని సూచించారు.

## సౌదీలో ఘోర ప్రమాదం

అక్కడికక్కడే మృతి చెందారు. మృతులంతా సౌదీ జాతీయులేనని సౌదీ ప్రభుత్వ వార్తా సంస్థ వెల్లడించింది. సౌదీ తూర్పు తీరంలోని రస్ తనూరా ప్రాంతంలో ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ విషయాన్ని ఇంధన మంత్రిత్వ శాఖ అధికారి ఒకరు ధ్రువీకరించినట్లు సౌదీ ప్రెస్ ఏజెన్సీ తన కథనంలో పేర్కొంది. ప్రమాదంపై సౌదీ ప్రభుత్వం ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించింది. అయితే, ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనపై సౌదీ అరామ్కో సంస్థ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. రస్ తనూరా ప్రాంతం సౌదీ ఇంధన రంగానికి అత్యంత కీలకం. ప్రపంచంలోనే అతిపెద్ద చమురు ఎగుమతి టెర్మినల్స్‌లో ఒకటి ఇక్కడే ఉంది. ప్రాంతీయ ఉద్రిక్తతల కారణంగా దాదాపు నాలుగు నెలల పాటు నిలిచిపోయిన కార్యకలాపాలు శుక్రవారమే ఇక్కడ తిరిగి ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో తాజా ప్రమాదం జరగడం గమనార్హం. మృతుల కుటుంబాలకు ఇంధన మంత్రిత్వ శాఖ ప్రగాఢ సంతాపం తెలియజేసింది. దర్యాప్తు పూర్తయితే ప్రమాదానికి సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

## హైదరాబాద్‌లో వేల కోట్ల విలువైన భూకబ్జాకు టీడీపీ ఎంపీ భారీ స్కెచ్..!

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దశాబ్దకాలం దాటిన తర్వాత కూడా రాష్ట్రంలో ఆంధ్రా నేతల ఆగడాలకు అంతులేకుండా పోతుంది. ఏపీ నేతలు హైదరాబాద్‌లో భూ కబ్జాకు తెరలేపుతున్న ఘటనలు రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. తాజాగా ఏపీ టీడీపీ ఎంపీ కేశినేని చిన్ని హైదరాబాద్‌లో భారీ విలువైన భూ కబ్జాకు ప్లాన్ చేశాడన్న వార్త చర్చనీయాంశంగా మారింది.టీడీపీ ఎంపీ కేశినేని చిన్ని వేల కోట్ల విలువైన 112 ఎకరాల ఐు పార్క్ స్థలం కబ్జాకు యత్నం చేసినట్టు కేశినేని నాని సీఎం రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. ప్రగతి నగర్ -- శాంషీగూడలో ఐటీ కారిడార్ విస్తరణ కోసం TGIIజకి కేటాయించిన అత్యంత విలువైన 112.72 ఎకరాల భూమిని కేశినేని చిన్ని కుటుంబ సభ్యుల బినామీ నెట్‌వర్క్ వీ/o ఎక్సెల్లా ప్రాపర్టీస్ ద్వారా ఆక్రమించేందుకు యత్నిస్తున్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. సర్వే నెంబర్ 57 లోని భూమి పూర్తిగా పోరంబోకు సర్కారీ (ప్రభుత్వ భూమి) అని కలెక్టర్ తేల్చినా ల్యాండ్ గ్రాబింగ్ ఆగకపోవడం అందరినీ విస్మయానికి గురిచేస్తోంది.

### లడ్డూపై లేచిన నోరు, అయోధ్య చోరీపై ఎందుకు లేవట్లేదు.. బాబు, పవన్‌లపై సీపీఐ నేత రామకృష్ణ తీవ్ర ఆగ్రహం!



ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లపై సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తిరుమల టీటీడీ లడ్డూ కల్తీ వ్యవహారంపై గతంలో పదేపదే ప్రచారం చేసిన ఈ ఇద్దరు నేతలు, ఇప్పుడు అయోధ్య రాముని విరాళాల చోరీ ఆరోపణలపై ఎందుకు స్పందించడం లేదని ఆయన నిలదీశారు. తిరుమల లడ్డూ విషయంలో భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయంటూ ఎక్కడపడితే అక్కడ విమర్శలు చేసి, ఏకంగా తిరుమలకు పాదయాత్రలు చేసిన పవన్ కళ్యాణ్, ఇప్పుడు అయోధ్య రామభక్తుల మనోభావాలు దెబ్బతింటే ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు. ఎన్డీయే కూటమిలో భాగస్వాములుగా ఉన్న వీరు ఈ నిధుల దుర్వినియోగంపై సమాధానం చెప్పాలన్నారు. సనాతన ధర్మ ప్రచారకర్తగా చెప్పుకునే పవన్ కళ్యాణ్, భక్తుల మనోభావాలను కాపాడటానికి ఇప్పుడు అమరావతి నుంచి అయోధ్య వరకు పాదయాత్ర చేయాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

## తెలంగాణలో కమలం వికసించే రోజు ఎంతో దూరంలో లేదు

నబీన్ వర్చువల్‌గా ప్రారంభించారు. అలాగే, బీజేపీ బూత్ అధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో నితిన్ నబీన్ పాల్గొని ప్రసంగించారు.తెలంగాణలోని 9 జిల్లాల నూతన బిజెపి కార్యాలయాల ప్రారంభోత్సవం సందర్భంగా బీజేపీ కార్యకర్తలందరికీ తన హృదయపూర్వక అభినందనలు అని నితిన్ నబీన్ పేర్కొన్నారు. నాడు నిజాం నిరంకుశత్వం నుంచి ఈ గడ్డకు విముక్తి ప్రసాదించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ స్ఫూర్తితో, ప్రధాని నరేంద్ర మోదీ అడుగుజాడల్లో దేశాభివృద్ధి కోసం కలిసికట్టుగా ముందుకు సాగుదామని బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు.తెలంగాణకు బీజేపీ ఒక కొత్త పార్టీ అని కొందరు మాట్లాడుతున్నారని అయితే బహుశా చరిత్రను మరచిపోయి ఉంటారని అన్నారు. 1980లో బీజేపీ ఏర్పాటు తర్వాత 1984 ఎన్నికలలో పార్టీ రెండు ఎంపీ స్థానాలు మాత్రమే గెలుపొందిందని అందులో ఒక స్థానాన్ని ఇచ్చి ఆదరించిన ఘనత ఈ తెలంగాణ గడ్డదేనని అన్నారు. బీజేపీ తెలంగాణకు పరాయి పార్టీ కాదు, తెలంగాణ ప్రజల గుండెల్లో ఉన్న పార్టీ అని అన్నారు.అప్పటి నుంచి తెలంగాణ ప్రజలు తమను విశ్వసిస్తూనే ఉన్నారని అన్నారు. తెలంగాణతో తమకు పోరాట బంధం, విశ్వాస బంధం ఉందని చెప్పారు. తెలంగాణ అవినీతి, బంధుప్రీతి పార్టీల పట్టులో ఉండటం వల్ల ప్రజల స్వప్నం నెరవేరలేదని ఆరోపించారు. తెలంగాణను అవినీతి, బంధుప్రీతి పార్టీ నుంచి విముక్తి చేసి అభివృద్ధి పథంలో నడిపించాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. 1980 నుంచి బీజేపీ కార్యకర్తలు కనబరుస్తున్న అంకితభావం వల్ల రాబోయే సంవత్సరాలలో తెలంగాణలోని ప్రతి గ్రామంలో, ప్రతి పట్టణంలో కమలం వికసిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.నేడు దేశంలోని ప్రతి రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగురుతుందని తెలంగాణలో కూడా కమలం వికసించే రోజు ఎంతో దూరంలో లేదని అన్నారు. పశ్చిమ బెంగాల్ తరహాలోనే తెలంగాణ గడ్డపై కూడా రెట్టింపు ఉత్సాహంతో పోరాడి విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. తమకు రాజకీయాలు అంటే అధికారం కాదని అదొక ఆధ్యాత్మిక సాధన అని పేర్కొన్నారు. తమకు రాజకీయాలు అంటే భోగం కాదని త్యాగం అని అన్నారు.హైదరాబాద్‌తో సహా తెలంగాణలోని ఇతర ప్రాంతాల్లో జరగనున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో బీజేపీ కార్యకర్తలు పోరాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఎన్నికల్లో పార్టీ విజయం కోసం నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని కోరారు. ప్రధాని మోదీ వికసిత్ భారత్ స్వప్నం సాకారం కావాలంటే తెలంగాణలో కూడా కమలం వికసించాలని ఆయన అన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీజేపీ పోరాడినప్పటికీ ఆ ప్రయోజనాన్ని కాంగ్రెస్ పొందిందని నితిన్ నబీన్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ప్రజల ప్రయోజనాల విషయంలో రాజీ పడుతుందని విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్‌ను ఓడించగలిగే శక్తి బీజేపీ శ్రేణులకు మాత్రమే ఉందని ఆయన అన్నారు.తెలంగాణ ఉద్యమం గురించి పార్లమెంట్ వేదికగా గళం వినిపించి ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో దివంగత బీజేపీ నాయకురాలు సుష్మా స్వరాజ్ కీలక పాత్ర పోషించారని నితిన్ నబీన్ అన్నారు. భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యామా ప్రసాద్ ముఖర్జీ, జనసంఘ్ నేత పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి ఆశయాలను నెరవేర్చడానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారని ఆయన అన్నారు.బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు ఎంఐఎం అవసరం కావొచ్చని బీజేపీ మాత్రం ఏ పార్టీ ఒత్తిడికి లోబడి లేదని నితిన్ నబీన్ అన్నారు. తమకు బలం, శక్తి తెలంగాణ ప్రజల నుండే వస్తాయని తాము వారి కోసమే పనిచేస్తామని అన్నారు. తాము వారసత్వ రాజకీయాలను కాకుండా జాతీయవాదాన్ని నమ్ముతామని బుజ్జగింపు రాజకీయాలను చేయమని తెలిపారు. తాము ఓటు బ్యాంకు రాజకీయాలను కాకుండా అభివృద్ధిని నమ్ముతామని తెలిపారు. కేవలం అధికారం నిలబెట్టుకోవడం కోసం ఇతరులతో రాజీపడే పార్టీలను సమూలంగా తొలగిద్దామని బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

## 'ఇడుపు కాయితం' అర్థం తెలియాలంటే పవన్‌ను అడగండి

పార్టీ బీఆర్ఎస్ కూడా మౌనంగా ఉండటాన్ని తీవ్రంగా తప్పుబట్టారు."రాష్ట్రంలో మరోసారి ఉద్యమకాలం నాటి పరిస్థితులు కనిపిస్తున్నాయి. అప్పుడు మనల్ని, మన భాషను ఎలా అయితే అవాకులు చెవాకులు పేలారో, ఇప్పుడు మళ్లీ అదే తరహా ప్రయత్నాలు జరుగుతున్నాయి. మనమందరం ఈ విషయాన్ని గమనించుకోవాలి. నిన్నగాక మొన్న 'ఇడుపు కాయితం' అనే పేరుతో ఒక సినిమా వచ్చింది. ఈ పేరు అర్థం కావడం లేదంటూ కొందరు దానిపై ట్రోలింగ్ చేస్తున్నారు. తెలంగాణ యాసను అవమానించడమే దీని వెనుక ఉన్న ఉద్దేశం. నేను ఒకటే సూటిగా అడుగుతున్నా 'ఇడుపు కాయితం' అంటే అర్థం తెలియకపోతే, వెళ్లి సినిమా నటుడు పవన్ కళ్యాణ్‌ను అడగండి. ఆయనకు ఆ పదం అర్థం బాగా తెలుసు, కచ్చితంగా వివరిస్తారు.మా భాషను, యాసను అవహేళన చేసినందుకే తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నాం. ఇంకోసారి ఇటువంటి వెకిలి ప్రయత్నాలు చేయకండి. ఒకరి భాషను ఒకరం, ఒకరి సంస్కృతిని ఒకరం గౌరవించుకుందాం. అందరం కలిసే ఉందాం. కానీ, తెలంగాణను అవమానిస్తాం, మా భాషను కించపరుస్తాం అంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదు. ఈరోజు తెలంగాణ భాషను ఇంతగా కించపరుస్తున్నా కాంగ్రెస్ పార్టీ నోరు మెదపదు. ఎందుకంటే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి తెలంగాణ ఉద్యమంతో ఎలాంటి సంబంధం లేదు. ఇక బీజేపీ సంగతి సరేసరి. దేశంలోని సమస్యలు తప్ప, తెలంగాణ గురించి వారికి పట్టదు. బీఆర్ఎస్ పార్టీ కూడా మాట్లాడదు. ఎందుకంటే, అందులో ఓ గుంటనక్క ఉంది. ఆయన వ్యాపారాలన్నీ ఇప్పటికీ ఆంధ్ర ప్రాంతానికి చెందిన వారితోనే ముడిపడి ఉన్నాయి" అని ఆరోపించారు.

## ఈ ఏడాది నేను బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్తాను

వివరించారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా, ఎవరెన్ని కుట్రలు చేసినా వాటిని అధిగమించి మరీ తాను తన సొంత దేశానికి చేరుకుంటానని ధీమాగా ప్రకటించారు.

### న్యాయస్థానాలు రాజకీయ ప్రతీకార సాధనాలుగా మారాయి!

తనపై నమోదైన కేసులు, కోర్టులు విధించిన మరణశిక్షలపై హసీనా తీవ్రంగా స్పందించారు. "నాపై వచ్చిన తీర్పులు చట్టబద్ధమైనవి కావు. అవి ముందస్తు వ్యూహంతో, రాజకీయ ప్రేరేపితంగా జరిగిన రాజ్యాంగ విరుద్ధ ప్రక్రియ. అవామీ లీగ్‌ను నాయకత్వ రహితంగా మార్చేందుకు ప్రస్తుత పాలకులు న్యాయ వ్యవస్థను ఓ ప్రతీకార సాధనంగా వాడుకుంటున్నారు. 1975లో నా తల్లిదండ్రులు, సోదరులతో సహా నా కుటుంబం మొత్తాన్ని కోల్పోయాను. నాపై గ్రెనేడ్ దాడులు కూడా జరిగాయి. నేను చావుకు భయపడను" అని ఆమె స్పష్టం చేశారు.

### అవామీ లీగ్ కేవలం పార్టీ కాదు.. అదొక శక్తి!

జూన్ 23వ తేదీన దేశవ్యాప్త నిషేధాన్ని ధిక్కరిస్తూ అవామీ లీగ్ తన 77వ వ్యవస్థాపక దినోత్సవాన్ని జరుపుకుంది. ఈ సందర్భంగా వందలాది మంది కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు. దీనిపై హసీనా స్పందిస్తూ.. అవామీ లీగ్ అనేది కేవలం కాగితాలకే పరిమితమైన సంస్థ కాదని, అది బంగ్లాదేశ్ మట్టిలో, ప్రజల గుండెల్లో పాతుకుపోయిన ఒక బలమైన రాజకీయ శక్తి అని అభివర్ణించారు. మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం, ప్రస్తుతం నకిలీ ఎన్నికల ద్వారా ఏర్పడిన బీఎన్‌పీ ప్రభుత్వ హయాంలో దేశంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని, మైనారిటీలపై దాడులు పెరిగాయని ఆరోపించారు.

### మైనారిటీలపై దాడి జరిగితే.. దేశ స్వాతంత్ర్యానికే ముప్పు!

బాంగ్లాదేశ్‌లో హిందూ తదితర మైనారిటీల రక్షణపై ఆమె తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆగస్టు 5వ తేదీ నాటి తిరుగుబాటు తర్వాత హిందూ దేవాలయాల ధ్వంసం, ఆస్తుల లూటీలు నిరంతరాయంగా సాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మైనారిటీల హక్కుల కోసం పోరాడిన చిన్మయ్ కృష్ణ దాస్ వంటి నాయకులను తప్పుడు కేసులతో జైల్లో పెట్టడాన్ని తప్పుబట్టారు. "మైనారిటీలు కేవలం ఓటు బ్యాంక్ కాదు. వారు దేశ సమాన పౌరులు. వారిపై జరిగే ప్రతి దాడి.. బాంగ్లాదేశ్ స్వాతంత్ర్యంపై జరిగే దాడితో సమానం" అని హెచ్చరించారు. ప్రస్తుతం భారత్‌లో ఉంటున్నప్పటికీ తన హృదయం ఎప్పుడూ బాంగ్లాదేశ్ ప్రజల కోసమే తపిస్తుందని, అవామీ లీగ్ త్వరలోనే ప్రజా బలంతో మళ్లీ అధికారంలోకి వస్తుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు.

## కేయూలో పురుగుల ఉప్మా..

హనుమకొండ చౌరస్తా, జూన్ 28: కాకతీయ యూనివర్సిటీ (కేయూ) హాస్టల్ మెస్‌లో ఆదివారం ఉదయం విద్యార్థులకు అందించిన ఉప్మాలో పురుగులు కనిపించడం కలకలం రేపింది. టిఫిన్‌లో పురుగులు గుర్తించిన విద్యార్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. యూనివర్సిటీ అధికారుల నిర్లక్ష్యంపై మండిపడ్డారు.హాస్టల్ మెస్‌లో నాణ్యమైన ఆహారం అందించడం లేదని కేయూ విద్యార్థులు ఆరోపించారు. గతంలోనూ భోజనంలో పురుగులు, ఇనుప మేకులు కనిపించిన విషయాన్ని గుర్తుచేశారు. మెస్‌లో నాణ్యమైన భోజనం పెట్టడం లేదని, ఉడికీఉడకని అన్నం, నీళ్లచారు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు జరుగుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని వాపోయారు. హాస్టల్ డైరెక్టర్, జాయింట్ డైరెక్టర్లకు పలుమార్లు ఫిర్యాదు చేసినా సమస్యలు పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మెస్ నిర్వహణలో సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. యూనివర్సిటీ మెస్‌లో నాన్ బార్డర్స్‌కు కూడా భోజనం అందిస్తున్నారని.. దీనివల్ల హాస్టల్ విద్యార్థులకు సరిపడా ఆహారం అందించడం లేదని అన్నారు. వెంటనే మెస్ నిర్వహణలో మార్పులు చేసి, నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనాన్ని అందించాలని డిమాండ్ చేశారు.

# బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు విద్యే ఆయుధం

**– మంత్రి దామోదర రాజనర్సింహా**



శివ్వంపేట : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు విద్యే ఆయుధమని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా అన్నారు. ఆదివారం శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామంలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్వంలో ఏర్పాటు చేసిన బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని మాజీ మంత్రి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ అంబేద్కర్ ఆదర్శప్రాయుడని, స్ఫూర్తి ప్రధాత అని కొనియాడారు. భారతరాజ్యాంగాన్ని రూపొందించి ప్రతీ పౌరుడికి సమాన హక్కులు, ఓటు హక్కు కల్పించిన మహనీయులని, రాజ్యాంగ నిర్మాత మాత్రమే కాకుండా ప్రపంచ మేధావుల్లో ఒకరిగా గుర్తింపు పొందారని అన్నారు.

దేశంలో ఆర్థిక అసమానతలు, అంటరానితనం వంటి సామాజిక రుగ్మతలను ఎదురుకొని మంచి విద్యను అభ్యసించి అందరికి ఆదర్శంగా నిలిచారని అన్నారు. ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్లే తెలంగాణ ప్రత్యేకరాష్ట్రం సాధ్యమైందన్నారు. అంబేద్కర్ సేవలను గుర్తించి బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ తొలిముఖ్యమంత్రి కేసీఆర్ హాయంలో నిర్మించిన నూతన సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టడంతో పాటు హైదరాబాద్ లో అత్యంత పెద్ద విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్టు గుర్తుచేశారు. నర్సాపూర్ నియోజకవర్గంలో మిషన్ భగీరథ నీరు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సమస్య పరిష్కారానికి నియోజకవర్గానికి 100 బోర్లుతో పాటు దానికి సంబంధించిన పైపులైన్లు, మోటర్లు మంజూరు చేయాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గంలో బీటీ రహదారుల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం విగ్రహదాత గౌరెడ్డి వెంకటనర్సింహారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బుర్ర మురళీగౌడ్, అంబేద్కర్ సంఘం అధ్యక్షులు ముంద్రాతి బాలేష్, జిల్లా గ్రంథాలయ చైర్పర్సన్ సుహాసినిరెడ్డి, నర్సాపూర్ మున్సిపల్ చైర్పర్సన్ లక్ష్మిరాజుయాదవ్, డీసీసీ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, కాంగ్రెస్ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు రమణాగౌడ్, జడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యులు మన్సూర్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటరాంరెడ్డి, అంబేద్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ఎక్స్‌ప్రెస్ వేపై ఎగ్జిట్ మిస్సైన కారు..



లక్నో: ఎక్స్‌ప్రెస్ వేపై ప్రయాణించిన కారు ఎగ్జిట్ వే మిస్సయ్యింది. దీంతో డ్రైవర్ ఆ కారును రివర్స్‌లో నడిపాడు. ఇంతలో వేగంగా దూసుకొచ్చిన స్కార్పియో ఎస్‌యూవీ దానిని ఢీకొట్టింది. సీసీటీవీలో రికార్డైన ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. (Car Missed exit turns deadly) హర్యానాలోని బహదూర్‌గఢ్‌కు చెందిన ఒక కుటుంబం హరిద్వార్‌లోని గంగానదిలో పుణ్యస్నానం, ఆలయ దర్శనం కోసం కారులో బయలుదేరారు. ఢిల్లీ–డెహ్రాడూన్ ఎక్స్‌ప్రెస్‌వేపై అది ప్రయాణించింది. కాగా, ఉత్తరప్రదేశ్‌లోని సహారన్‌పూర్ జిల్లాలో 'హల్గోయా కట్' సమీపంలో ఎగ్జిట్ వేను కారు డ్రైవర్ మిస్ అయ్యాడు. దీంతో ఆ కారును రివర్స్ చేస్తుండగా అతివేగంగా వచ్చిన స్కార్పియో ఎస్‌యూవీ బలంగా ఢీకొట్టింది. ఆ కారును కొంతదూరం ఈడ్చుకెళ్లిన స్కార్పియో అదుపుతప్పి రోడ్డుపై బోల్తాపడింది. మరోవైపు ఈ ప్రమాదంలో ఆ కారు నుజ్జునుజ్జు అయ్యింది. అందులో ప్రయాణించిన వారిలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే మరణించారు. మృతులను ప్రవీణ్ (40), అతడి భార్య ప్రీతి (37), వృద్ధురాలైన తల్లి సుదేశ్, తొమ్మిదేళ్ల శివాన్ష్‌గా పోలీసులు గుర్తించారు. ఆ కుటుంబానికి చెందిన మరో ముగ్గురు తీవ్రంగా గాయపడగా వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## టీడీపీ దాడులకు బయపడే ప్రసక్తే లేదు

**– అంబటి రాంబాబు**



అమరావతి : ఏపీలో టీడీపీ ప్రభుత్వ అరాచక పాలనకు, దాడులకు బయపడే ప్రసక్తే లేదని మాజీ మంత్రి , వైసీపీ నాయకుడు అంబటి రాంబాబు స్పష్టం చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. శనివారం ఉండవల్లిలో వైసీపీ నాయకులపై దాడిని తీవ్రంగా ఖండించారు. దాడులకు పాల్పడడమే కాకుండా ఉల్టా తమపైనే కేసులు బనాయించడం ధర్మామమా అంటూ ప్రశ్నించారు. దాడులకు పాల్పడింది స్పష్టంగా వీడియో రికార్డులో ఉందని పేర్కొన్నారు. అనైతీకంగా, అరాచకాలకు పాల్పడుతున్న చంద్రబాబుకు బుద్ధి చెప్పడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. టీడీపీ దాడులకు బయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అమరావతిపై చంద్రబాబు రూ.47 వేల కోట్లు అప్పు చేశారని ఆరోపించారు . అమరావతిని అడ్డుపెట్టుకుని చంద్రబాబు దోపిడీకి పాల్పడుతున్నారని, భూములు ఇవ్వడానికి ఇష్టపడని రైతులను వేదిస్తున్నారని, రైతుల పొలాల్లోకి కొండవీటి వాగు నీళ్లను మళ్లిస్తూ పంటను నాశనం చేస్తున్నారని ఆరోపించారు. అమరావతి రైతుల వద్దకు వెళ్లడానికి పర్మిషన్ కావాలా అదేమైనా పాకిస్తానా అంటూ నిలదీశారు. టీడీపీ గూండాల చేతిలోనే కానిస్టేబుల్ గాయపడ్డారని అంబటి స్పష్టం చేశారు. సాయికృష్ణ కేసును సీబీఐతో విచారించాలని తల్లి విజయలక్ష్మి పిటిషన్ వేసింది. డెడ్‌బాడీ విలువ చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు తెలుసా.. డెడ్‌బాడీ, బూడిద కూడా ఇవ్వకుండా క్రిమినల్ అంటూ మాట్లాడడం సమంజసమా అంటూ ప్రశ్నించారు.

## భార్యపై అనుమానం..
## ఇంట్లో నిద్రిస్తుండగా నరికి చంపిన భర్త




బెంగళూరు: తన భార్యకు మరో వ్యక్తితో సంబంధం ఉన్నదని ఆమె భర్త అనుమానించాడు. మద్యానికి బానిసైన అతడు ఇంట్లో నిద్రిస్తున్న భార్యను నరికి చంపాడు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు అతడ్ని అరెస్ట్ చేశారు. కర్ణాటకలోని బెళగావి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. 35 ఏళ్ల శోభ, పర్గుండ సరవాద్‌కు 15 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. కాగా, కటగేరిలోని ఓజికర్ మఠం పాఠశాలలో వంట మనిషిగా శోభ పనిచేస్తున్నది. అయితే తన భార్యకు మరో వ్యక్తితో అక్రమ సంబంధం ఉన్నట్లు భర్త అనుమానించాడు. ఈ నేపథ్యంలో మద్యం సేవించిన అతడు రాత్రి వేళ ఇంట్లో నిద్రిస్తున్న భార్యపై పదునైన ఆయుధంతో నరికి చంపాడు. మరోవైపు ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆ ఇంటికి చేరుకున్నారు. శోభ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం తరలించారు. ఆమె హత్యపై కేసు నమోదు చేశారు. నిందితుడైన భర్తను పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే భార్య ప్రవర్తనపై భర్తకు ఉన్న అనుమానం, అతడి మద్యపాన వ్యసనం ఈ హత్యకు కారణంగా ప్రాథమిక విచారణలో తెలిసినట్లు పోలీస్ అధికారి తెలిపారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## జూలై 5న జూబ్లీహిల్స్ ముఖ్య కార్యకర్తల సమావేశం

**– మాగంటి సునీత**



తెలంగాణ భవన్‌లో జూలై 5 న జూబ్లీహిల్స్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నామని జూబ్లీహిల్స్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మాగంటి సునీత వెల్లడించారు. తెలంగాణ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాగంటి సునీత మాట్లాడుతూ.. జూలై 5 న నిర్వహించనున్న కార్యకర్తల సమావేశానికి పార్టీ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, పార్టీ సీనియర్ నేతలు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో సర్, పార్టీ సభ్యత్వ నమోదుపై చర్చిస్తామన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అందరం కలిసికట్టుగా పని చేస్తున్నామని.. పార్టీ శ్రేణుల మధ్య

## ఏపీలో రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లపై బొత్స కీలక వ్యాఖ్యలు



అమరావతి : ఏపీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన ఏర్పాట్లపై వైసీపీ ఎమ్మెల్సీ, మండలి ప్రతిపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ కూటమి సర్కార్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. జూలై ఒకటిన రాష్ట్రపతి రాష్ట్రంలో పర్యటన సందర్భంగా ఆమెకు ప్రైవేట్ హోటల్‌లో బస ఏర్పాటుపై మండిపడ్డారు. వాస్తవానికి ఆమెకు ప్రభుత్వ అతిధి గృహంలో బస ఏర్పాటు చేయాల్సి ఉండగా ప్రైవేట్ సంస్థకు సంపదను దోచుపెట్టేందుకు రాష్ట్రపతిని ప్రైవేట్ హోటల్‌లో బస ఏర్పాట్లు చేస్తున్నారని ఆరోపించారు. ఈ నిర్ణయం వల్ల రాష్ట్రం పరువు పోతుందని పేర్కొన్నారు. అవసరం అనుకుంటే ప్రభుత్వ గెస్ట్‌హౌజ్‌లను ఆధునీకరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఆటవిక రాజ్యం నడుస్తుందని, వైసీపీ నాయకులు అమరావతిలో రైతులతో మాట్లడేందుకు వెళ్తే టీడీప గూండాలు దాడులకు పాల్పడి తమపైనే ఎస్సీ,ఎస్టీ కేసులు నమోదు చేయడం ఎంతవరకు సమంజసమని అన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ఇష్టారాజ్యంగా ప్రవర్తించడం ప్రజాస్వామ్యానికి తీరని మచ్చను తీసుకువస్తున్నారని వెల్లడించారు. అమరావతిలో అక్రమాలు బయట పడతాయనే భయంతో ప్రభుత్వం నీచ రాజకీయాలు చేస్తుందని విమర్శించారు. దేశ సంస్కృతికి విరుద్ధంగా బీచ్‌లు, ఎయిర్‌పోర్టులలో బార్లు పెట్టే ఆలోచనను వ్యతిరేకించారు. ఏపీలో రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నన్ని రోజులు మొదట నష్టపోయేది రైతులేనని పేర్కొన్నారు.

## హోటల్ యజమానికి బాలిక విక్రయం..
## 5 రోజుల పాటు 30 మందికిపైగా అత్యాచారం



జైపూర్: ఇంటి నుంచి అదృశ్యమైన బాలికను ఒక వ్యక్తి హోటల్ యజమానికి అమ్మేశాడు. ఈ నేపథ్యంలో ఐదు రోజుల పాటు 30 మందికిపైగా వ్యక్తులు ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. బాధిత బాలిక ఫిర్యాదుతో పలువురు హోటల్ యజమానులు, నిర్వాహకులను పోలీసులు అరెస్ట్ చేశారు. రాజస్థాన్‌లోని శ్రీ గంగానగర్ జిల్లాలో ఈ దారుణం జరిగింది. 13 ఏళ్ల బాలిక తన ఇంటి నుంచి అదృశ్యమైంది. రిక్షా లాగే వ్యక్తి ఆమెను ఒక హోటల్ యజమానికి విక్రయించాడు. ఈ నేపథ్యంలో ఐదు రోజుల పాటు పలు హోటల్స్‌లో ఆ బాలికపై లైంగిక దాడి జరిగింది. సుమారు 30 మందికిపైగా వ్యక్తులు ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. కాగా, బాధిత బాలిక ఈ దారుణం గురించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పదేపదే జరిగిన అత్యాచారాల వల్ల కలిగే బాధను భరించలేనప్పుడు తనతో బలవంతంగా మద్యం తాగించారని ఆమె ఆరోపించింది. దీంతో పోస్కో చట్టంతోపాటు పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. పలువురు హోటల్ యజమానులు, నిర్వాహకులను అరెస్టు చేశారు. మరోవైపు ఈ నేర సంఘటన బయటకు రాకుండా అణచివేసే ప్రయత్నం జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ఆగ్రహం వెల్లువెత్తింది. శ్రీ గంగానగర్ ప్రముఖ పర్యాటక ప్రాంతం కానప్పటికీ 150కు పైగా అక్రమ హోటళ్లు ఉన్నాయని స్థానికులు ఆరోపించారు. వాటిని వెంటనే మూసివేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ కూడా నిరసనలో పాల్గొన్నది. రిక్షా లాగే వ్యక్తితో పాటు హోటల్ నిర్వాహకులందరిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని, సంబంధిత పోలీస్ స్టేషన్‌కు చెందిన అధికారులను సస్పెండ్ చేయాలని ఆ పార్టీ నేతలు డిమాండ్ చేశారు.

## అర్ధరాత్రి ఆస్పత్రిలో మహిళ హల్ చల్..



ఎల్బీ నగర్‌లోని హాస్పిటల్‌లో అర్ధరాత్రి ఓ మహిళ హల్ చల్ చేసింది. లలిత కరీర అనే మహిళ కడుపునొప్పి ఉందంటూ ఎల్బీ నగర్ శ్రేష్ఠ ఆరెంజ్ హాస్పిటల్‌లోని అత్యవసర విభాగంలో చేరింది. ప్రాథమిక చికిత్సనందించిన డాక్టర్లు ఆమెకు పరీక్షలు నిర్వహించి ఎలాంటి అనారోగ్య సమస్య లేదని తెలియజేశారు. దీంతో లలిత కరీర డాక్టర్లపై ఆగ్రహంతో ఊగిపోతూ దూషిస్తూ వారిపై దాడికి పాల్పడింది. దాడి అనంతరం లలిత కరీర యూ 08 ఎ+ 9824 నంబర్ కారును స్వయంగా నడుపుకుంటూ వనస్థలిపురంలోని సహారా హాస్పిటల్‌కు వెళ్లింది. ఈ నేపథ్యంలో ఆస్పత్రి సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా ఎల్బీ నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఇంతకీ ఆ మహిళ డాక్టర్లు, ఆస్పత్రి సిబ్బంది పట్ల అలా ఎందుకు ప్రవర్తించిదనేది తెలియాల్సి ఉంది.

## పోలియో మహమ్మారిని తరిమికొడదాం..
## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**– పట్నం మహేందర్ రెడ్డి**



పోలియో మహమ్మారిని తరిమికొట్టి పోలియో రహిత సమాజాన్ని నిర్మించడానికి ప్రతి పౌరుడు కంకణ బద్దులు కావల్సిన అవసరం ఉందని శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. జాతీయ పల్స్ పోలియో దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం చేవెళ్ల నియోజకవర్గం మొయినాబాద్ మునిసిపాలిటీ కేంద్రంలో గల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఐదేళ్లలోపు పిల్లలకు మున్సిపల్ చైర్ పర్సన్ షాబాద్ సోనియా దర్శన్‌తో కలిసి పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలోని వ్యాక్సినేటర్లతో కలిసి 4 లక్షల 21 వేల మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 1618 పోలియో కేంద్రాలు, పట్టణ ప్రాంతంలో 493 గ్రామీణ ప్రాంతాల్లో 1195 కేంద్రాల్లో పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని తెలిపారు. పోలియో చుక్కల కేంద్రాలలో రెండు రోజులపాటు పోలియో చుక్కలను వేసే కార్యక్రమం సాగుతుందని చెప్పారు. చేవెళ్ల నియోజకవర్గంలో 32,000 మంది ఐదేళ్లలోపు వయస్సు గల పిల్లలకు పోలియో చుక్కలను వేస్తున్నట్లు తెలిపారు. పోలియో నిర్మూలన కోసం ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటుందని వివరించారు. ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వ కార్యక్రమాలకు సహకరించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి భీం భరత్, మున్సిపల్ చైర్ పర్సన్ షాబాద్ సోనియా దర్శన్, మాజీ జెడ్పిటిసి కాలే శ్రీకాంత్, కంజర్ల భాస్కర్, మాజీ సర్పంచ్ పురాణం వీరభద్ర స్వామి, జిల్లా వైద్యాధికారి స్వర్ణ కుమారి, మండల వైద్యాధికారి అన్నపూర్ణ, సిహెచ్‌ఓ వెంకట్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, పిఎసిఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీ సతీష్, టీపీసీసీ సభ్యులు షాబాద్ దర్శన్, మండల శాఖ అధ్యక్షుడు మాణయ్య, సీనియర్ నాయకులు దేవరంపల్లి మహేందర్ రెడ్డి, కీసరి సంజీవరెడ్డి, బాలరాజ్ ముదిరాజ్, పట్నం రామ్ రెడ్డి, హన్మంత్ యాదవ్, గడ్డం వెంకట్ రెడ్డి, రవిందర్ రెడ్డి, కేబుల్ రాజు, సత్యనారాయణ, బాలకృష్ణారెడ్డి, విజయ రాజు, గణేష్ గౌడ్, వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

## పెళ్లికి నిరాకరించిన యువతి..
## ఇంట్లో నిద్రిస్తుండగా ఇంటికి నిప్పు..

**యువతికి తీవ్ర గాయాలు**



ఒడిశాలో దారుణం జరిగింది. ఒక యువతి తనతో పెళ్లికి నిరాకరించిందని ఆగ్రహించిన ఒక యువకుడు ఆమె ఇంటిని దహనం చేసేందుకు ప్రయత్నించాడు. ఈ ఘటనలో ఇంట్లో నిద్రిస్తున్న ఆ యువతి తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన ఒడిశాలోని సుందర్‌గఢ్ జిల్లాలోని బిస్రా బ్లాక్‌కు చెందిన ఒక గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అదే ప్రాంతానికి చెందిన రజత్ కిరో అనే వ్యక్తి కొంతకాలంగా ఒక యువతిని ఇష్టపడుతున్నాడు. తనను పెళ్లి చేసుకుంటానని కూడా ఆమెకు చెప్పాడు. కానీ, ఇందుకు ఆమె నిరాకరించింది. ప్రేమ, పెళ్లికి ఒప్పుకోలేదు. దీంతో గతంలో ఆమెపై దాడి కూడా చేశాడు. ఇలా అనేకసార్లు తన ప్రేమ విషయం చెప్పినా ఒప్పుకోకపోవడంతో ఆమెను చంపాలని నిర్ణయించుకున్నాడు. శుక్రవారం రాత్రి ఆమె తన ఇంట్లో నిద్రిస్తుండగా ఇంట్లోకి పెట్రోల్ పోసి నిప్పంటించాడు. దీంతో మంటలు వ్యాపించడంతో ఇంట్లో నుంచి ఆ యువతి అరిచింది. అలాగే, ఆ ఇంటికి పక్కనే ఉన్న యువతి బంధువులు కూడా వెంటనే స్పందించారు. అప్పటికే ఇల్లు చాలా వరకు కాలిపోయింది. ఇంకా మంటలు ఎగసిపడుతున్నాయి. వెంటనే ఇతర కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానికులు స్పందించి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఎలాగోలా శ్రమించి, ఆమెను ఇంట్లోంచి బయటకు తీసుకొచ్చారు. అప్పటికే ఆమెకు తీవ్రంగా కాలిన గాయాలయ్యాయి. వెంటనే ఆమెను రూర్కేలాలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆమెకు 40 శాతం కాలిన గాయాలయ్యాయని, ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. మరోవైపు ఈ ఘటనపై యువతి కుటుంబం పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధిత యువతి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నిందితుడిని రజత్ కిరోగా గుర్తించారు. అతడిని ఇప్పటికే అరెస్టు చేసి విచారిస్తున్నారు. ఘటనా స్థలానికి పోలీసులు, ఫోరెన్సిక్ నిపుణులు వెళ్లి ఆధారాలు సేకరించారు. నిందితుడికి కఠిన శిక్ష పడేలా చేస్తామని పోలీసులు తెలిపారు. కేసు తదుపరి విచారణ కొనసాగుతోంది.

## పక్షవాత బాధితుడికి అండగా

# పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ

**- వీల్‌చైర్ అందజేసిన ఎంపీ పీఏ : గంగామహి**



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** మానవతా దృక్పథాన్ని చాటుతూ పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ సౌజన్యంతో ఆయన వ్యక్తిగత కార్యదర్శి, అనంతపల్లి గ్రామానికి చెందిన బైరి గంగామహి అదే గ్రామానికి చెందిన కన్నం విజయసింహ పక్షవాతంతో బాధపడుతున్న నేపథ్యంలో వీల్‌చైర్‌ను అందజేశారు. అనారోగ్య కారణాలతో నడవలేని పరిస్థితిలో ఉన్న విజయసింహ ఇబ్బందులను తెలుసుకున్న ఎంపీ కార్యాలయం వెంటనే స్పందించింది. ఎంపీ గడ్డం వంశీకృష్ణ సహకారంతో వీల్‌చైర్‌ను ఏర్పాటు చేసి బాధితుడికి అందజేయడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విజయసింహ కుటుంబ సభ్యులు తమ కష్ట సమయంలో అండగా నిలిచిన ఎంపీ గడ్డం వంశీకృష్ణకు, ఆయన వ్యక్తిగత కార్యదర్శి బైరి గంగామహికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జంగా పురుషోత్తం, బూరుగు ప్రవీణ్ కుమార్, గణేష్, కొండ మల్లయ్య, గడ్డం రమేష్, నరేష్, సురేష్, యువజన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బోయినిపల్లి పోలీసుల చాకచక్యం..
## చోరీ కేసు ఛేదన

**- బంగారం, మొబైల్ రికవరీ... నిందితుడి అరెస్టు**




**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం,మల్కాపూర్ గ్రామంలో ఈ నెల 25న జరిగిన ఇంటి చోరీ కేసును బోయినిపల్లి పోలీసులు ఛేదించి, సార్వారెడ్డిపల్లికి చెందిన కొత్తూరి మధు (21)ను అరెస్టు చేసినట్లు వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. కోరెపు పెద్దులు కుటుంబ సభ్యులతో వివాహానికి వెళ్లిన సమయంలో నిందితుడు ఇంట్లోకి ప్రవేశించి 3 గ్రాముల బంగారు పుస్తెలు, రూ.10 వేల నగదు, రెడ్‌మీ మొబైల్ ఫోన్‌ను చోరీ చేశాడు. సాంకేతిక ఆధారాలతో నిందితుడిని పట్టుకున్న పోలీసులు బంగారు పుస్తెలు, మొబైల్‌ను స్వాధీనం చేసుకోగా, నగదును ఖర్చు చేసినట్లు విచారణలో తేలింది. నిందితుడిపై గతంలో 6 చోరీ కేసులు ఉండటంతో పాటు ఒకసారి పీడీ చట్టం కింద కూడా నిర్బంధించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం అతడిని కోర్టులో హాజరుపరచగా జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. కేసును ఛేదించిన బోయినిపల్లి ఎస్ఐ ఎన్. రమాకాంత్, ఫింగర్ ప్రింట్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుళ్లు జగదీష్, భూమయ్య, కానిస్టేబుళ్లు అచ్యుత్, లక్ష్మీనారాయణలను వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ అభినందించారు.

## శివ్వంపేట మండలం, పిల్లుట్ల గ్రామంలో బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహావిష్కరణ లో పాల్గొన్న రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) శివంపేట మండల పరిధిలోని పిల్లుట్ల గ్రామంలో పండుగ వాతావరణం నెలకొందన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ గారి విగ్రహాన్ని ఆవిష్కరించటం ఆనందంగా ఉందన్నారు. ఈ విగ్రహం సమానత్వానికి ప్రతీక. సామాజిక న్యాయానికి చిహ్నం. ప్రతి పేద కుటుంబానికి ఆశాజ్యోతి. ప్రతి యువకుడికి స్ఫూర్తి గా నిలుస్తుందన్నారు. అంబేడ్కర్ జీవితం మనందరికీ ఆదర్శమన్నారు. చిన్నతనంలోనే కుల వివక్షను ఎదుర్కొన్నారు. చదువుతో ప్రపంచాన్ని గెలిచారన్నారు. వారు మనకు చెప్పిన గొప్ప సందేశం ఒక్కటే... పుట్టుక మన చేతిలో ఉండదు... కానీ జీవితాన్ని ఎలా తీర్చిదిద్దుకోవాలో మన చేతిలోనే ఉంటుందన్నారు. బాబాసాహెబ్ డా. బి ఆర్ అంబేడ్కర్ బహుభాషావేత్త. ఆర్థికశాస్త్రం, రాజకీయశాస్త్రం, న్యాయశాస్త్రం, చరిత్ర అన్నింటిలో నిష్ణాతుడు. అణగారిన వర్గాల కోసం జీవితాంతం పోరాటం చేశారు. అంబేడ్కర్ గారు తన కోసం జీవించలేదు. సమాజం కోసం జీవించారు. అంటరాని తనానికి వ్యతిరేకంగా పోరాడారు. సమాన హక్కుల కోసం దేశవ్యాప్తంగా ఉద్యమించారు. గౌరవంగా జీవించడం ప్రతి మనిషి హక్కు" అని ఆయన మనకు నేర్పించారు. మన దేశానికి బీ.ఆర్ అంబేడ్కర్ అందించిన అత్యంత గొప్ప కానుక భారత రాజ్యాంగం. రాజ్యాంగం ప్రతి భారతీయుడికి... సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం, గౌరవప్రదమైన జీవితం అందించిందన్నారు అందుకే ఆయనను భారత ప్రజాస్వామ్య శిల్పి గా పిలుస్తామన్నారు. బాబాసాహెబ్ చెప్పిన మార్గంలో సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, మానవ గౌరవం కోసం మనమందరం కలిసి ముందుకు సాగుదాం. మన యువత. బాబాసాహెబ్ జీవితాన్ని చదవాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని తెలుసుకోవాలి. విద్యను ఆయుధంగా మార్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బుర్ర మురళీ గౌడ్, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ రాజిరెడ్డి ప్రముఖ సంఘ సేవకులు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బండారి గంగాధర్ అంబేడ్కర్ సంఘం నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజా సేవలపై
# ముత్యాల సునీల్ కుమార్ ఫోకస్...!

- ప్రభుత్వ భవనాలు సందర్శన...!!
- అభివృద్ధి పనుల్లో రాజీ లేదు - ప్రజా అవసరాలే ప్రాధాన్యం
- సంక్షేమాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది
- కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జి : ముత్యాల సునీల్ కుమార్





**భీంగల్ (ప్రశ్న న్యూస్)** నిజామాబాద్ జిల్లా, బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్ ఆదివారం భీంగల్ మండల కేంద్రంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజా అవసరాలకు సంబంధించిన పలు ప్రభుత్వ భవనాలు, నిర్మాణ దశలో ఉన్న సముదాయాలను స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా పంచాయతీరాజ్ అతిథి గృహాన్ని సందర్శించి భవనంలోని వసతులు, అతిథులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం స్థానిక ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్య సేవలు అందించేందుకు నిర్మించిన 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించి, అక్కడ అందుతున్న వైద్య సేవలు,మౌలిక సదుపాయాలు, రోగుల వసతులపై సిబ్బందితో చర్చించారు. తదుపరి కోర్టు భవన సముదాయాన్ని సందర్శించి, ప్రజలకు న్యాయ సేవలు వేగంగా, సులభంగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ముత్యాల సునీల్ కుమార్ మాట్లాడుతూ, ప్రజాధనంతో నిర్మించిన ప్రతి ప్రభుత్వ భవనం ప్రజలకు పూర్తిస్థాయిలో ఉపయోగపడాలని అన్నారు. భీంగల్ ప్రాంత ప్రజలకు 100 పడకల ఆసుపత్రి ద్వారా మెరుగైన వైద్య సేవలు, కోర్టు భవనం ద్వారా సకాలంలో న్యాయ సేవలు అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. అభివృద్ధి,మౌలిక వసతుల కల్పనలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భీంగల్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## కె డి ఆర్ బ్లిట్జ్ అద్వర్యంలో నాచారంలో ఘనంగా టైక్వాండో పురస్కారాలు





నాచారం (ప్రశ్న న్యూస్) నాచారం కె డి ఆర్ సంస్థ అద్వర్యం లో నాచారం లోని ఇంద్ర స్కూల్ లో నిర్వహించిన పోటీల్లో పిల్లలకు మరియు యువకులకు టైక్వాండో లో భాగంగా పలు పురస్కారాలు ప్రశంశ పత్రాలను అందజేశారు. పిల్లల్లో చదువులతో పాటు శారీరక దృఢత్వం అవసరమని కె డి ఆర్ బ్లిట్జ్ వ్యవస్థాపకులు కె దయాకర్ రావు ఈ సందర్భంగా తెలియజేసారు. ముక్యంగా బాలికలకు ఆపద సమయం లో తమకు తాము రక్షణ కల్పించుటకు టైక్వాండో చాలా అవసరమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు కూడా పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని తమ పిల్లలు చేస్తున్న విన్యాసాలను చూసి మురిసిపోయారు. తమ పిల్లల్లో మానసిక ధైర్యం ఇదివరకు కన్న ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తుందని తల్లిదండ్రులు కె డి ఆర్ సంస్థకు అభినందనలు తెలియజేసారు. ఇందులో కె డి ఆర్ బ్లిట్జ్ వ్యవస్థాపకులు గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డు గ్రహీత దయాకర్ రావు తో పాటు ఇదే సంస్థలో నేర్చుకొని తిరిగి పలువురికి శిక్షణలు అందిస్తున్న అల్కాపురి సురేష్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలలో అనూహ్య రద్దీ కారణంగా సోమవారం వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు



తిరుమల : వేసవి సెలవులు ముగిసిపోవడంతో పాటు వారాంతం రావడంతో తిరుమల లో అనూహ్య రద్దీ నెలకొంది. దీంతో అధిక మంది భక్తులకు దర్శనాలు కల్పించేందుకు సోమవారం వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేసినట్లు టీటీడీ అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఆదివారం సిఫార్సు లేఖలు స్వీకరించలేదని స్పష్టం చేశారు. ఆన్ లైన్ కరెంట్ బుకింగ్ లో ఏరోజుకారోజు జారీ చేసే 800 శ్రీవాణి దర్శన టికెట్ల జారీని కూడా సోమవారం రద్దు చేశామన్నారు. ఈ విషయాన్ని గమనించి భక్తులు తమ తిరుమల యాత్రకు ప్రణాళిక చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వేలాదిమంది భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో టీటీడీ సీనియర్ అధికారులందరూ భక్తులకు అందుతున్న సౌకర్యాలను పర్యవేక్షిస్తూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నారు.

### 85,582 మంది దర్శనం

ఇటీవల కాలంలో శనివారం అత్యధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 85,582 మంది శ్రీవారిని దర్శించుకోగా 44,155 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులతో అన్ని కంపార్టుమెంట్లు నిండిపోగా టోకెన్లు లేని భక్తులకు 30 గంటల్లో సర్వదర్శనం అవుతుందని టీటీడీ అధికారులు వివరించారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 3.76 ఆదాయం వచ్చిందన్నారు. 4.66 లక్షల లడ్డూలను విక్రయించగా 3.43 లక్షల మంది అన్నదానం స్వీకరించారని వివరించారు.

## తిరుగుతున్న ప్రొపెల్లర్ తగిలి..
# మహిళా ట్రైనీ పైలట్‌కు గాయాలు



లక్నో: శిక్షణలో భాగంగా విమానం నడిపిన మహిళా ట్రైనీ పైలట్ ల్యాండింగ్ తర్వాత ఇంజిన్ ఆన్‌లో ఉండగానే కిందకు దిగింది. దీంతో తిరుగుతున్న ప్రొపెల్లర్ ఆమె వెనుక భాగానికి తగలడంతో గాయపడింది. ఆ మహిళను వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో ఈ సంఘటన జరిగింది. జూన్ 26న కాన్పూర్‌లోని చకేరి విమానాశ్రయంలో గార్గ్ ఏవియేషన్‌కు చెందిన ట్విన్ ఇంజిన్ విమానంలో మహిళా ట్రైనీ పైలట్ రాత్రిపూట శిక్షణ పొందింది. ఆమెతో పాటు ఫ్లైట్ ఇన్‌స్ట్రక్టర్ కూడా అందులో ఉన్నారు. కాగా, ఆ విమానం ల్యాండింగ్ తర్వాత ఇంజిన్ ఆన్‌లో ఉండగానే మహిళా ట్రైనీ పైలట్ కిందకు దిగింది. దీంతో తిరుగుతున్న విమానం ప్రొపెల్లర్ ఆమె వీపు భాగానికి తగలడంతో గాయపడింది. ఆ ట్రైనీ పైలట్‌ను కాన్పూర్‌లోని ఆసుపత్రిలో అడ్మిట్ చేసి చికిత్స అందిస్తున్నారు. మరోవైపు ఈ సమాచారం తెలుసుకున్న డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) దీనిపై విచారణ చేపట్టింది. విచారణ పూర్తయ్యే వరకు సంబంధిత ఇన్‌స్ట్రక్టర్‌ను ఫ్లైయింగ్ ట్రైనీ విధులకు దూరంగా ఉంచాలని ఆదేశించింది. అలాగే విచారణ కొనసాగుతున్నంత కాలం ఆ విమానాన్ని వినియోగించకూడదని కూడా ఆదేశించినట్లు డీజీసీఏ పేర్కొంది.

## లండన్‌లో తెలంగాణ విద్యార్థి అనుమానాస్పద మృతి.. హత్యా లేక ఆత్మహత్యా.. తేల్చాలంటున్న కుటుంబం



లండన్‌లో ఉన్నత విద్య అభ్యసించేందుకు వెళ్లిన తెలంగాణ విద్యార్థి అనుమానాస్పదంగా మరణించాడు. తన గదిలో జూన్ 23న ఉదయం అతడి మృతదేహాన్ని స్నేహితులు గుర్తించారు. అయితే, అతడి మృతిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి పేరు శ్రీనాథ్ రెడ్డి. కామారెడ్డి జిల్లా, రాజంపేట మండలం, తలమడ్ల గ్రామంలోని మధుసూధన్ రెడ్డి తనయుడు. 14 నెలల క్రితం ఎంఎస్ చదివేందుకు శ్రీనాథ్ రెడ్డి లండన్ వెళ్లాడు. అక్కడ స్నేహితులతో ఉంటున్నాడు. ఈ నెల 22న రాత్రి చివరిసారిగా కుటుంబ సభ్యులకు ఫోన్ చేశాడు. అదే రోజు రాత్రి మరణించాడు. జూన్ 23న ఉదయం అతడి మరణించి ఉన్నట్లు స్నేహితులు తెలిపారు. శ్రీనాథ్ రెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడని అతడి రూమ్‌మేట్స్ అంటున్నారు. ఈ విషయంపై శ్రీనాథ్ రెడ్డి బంధువులకు, స్నేహితులకు సమాచారం ఇచ్చారు. వారు ఇండియాలోని కుటుంబ సభ్యులకు విషయం తెలిపారు. అయితే, శ్రీనాథ్ రెడ్డి మరణంపై అతడి కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అతడు ముందు రోజు రాత్రే తమకు ఫోన్ చేసి మాట్లాడాడని, ఎప్పట్లాగే చాలా మామూలుగా మాట్లాడాడని అంటున్నారు. ఆ రోజు రాత్రి తన స్నేహితుల బర్త్ డే పార్టీకి హాజరయ్యాడని చెప్పారు. ఆ మరుసటి రోజే అతడు మరణించినట్లు తమకు కబురందిందన్నారు. ముందురోజు రాత్రి చాలా మామూలుగా మాట్లాడిన వ్యక్తి ఎలా ఆత్మహత్యకు పాల్పడుతారని వారు ప్రశ్నిస్తున్నారు. అందువల్ల శ్రీనాథ్ రెడ్డిది హత్యా.. ఆత్మహత్యా అన్నది తేల్చాలని కోరుతున్నారు. ఈ విషయంలో తమకు తెలంగాణ ప్రభుత్వంతోపాటు కేంద్ర ప్రభుత్వం కూడా సాయం చేయాలని విన్నవించారు. శ్రీనాథ్ మరణంపై ఉన్న అనుమానాలు నిగ్గుతేల్చాలని కోరుతున్నారు. తమ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని, శ్రీనాథ్ మృతదేహాన్ని ఇండియా తెచ్చేందుకు సాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని కోరారు.

## లోహగఢ్ కోటకు సియా గోయల్.. కేతన్ హత్య సీన్ రీ క్రియేట్ చేసిన పోలీసులు



మహారాష్ట్రలోని పూనేకు చెందిన వ్యాపారి కేతన్ అగర్వాల్ హత్య కేసు విచారణ కొనసాగుతోంది. ప్రధాన నిందితురాలు సియా గోయల్, ఆమె ప్రియుడు చేతన్ చౌదరి ప్రస్తుతం పోలీసు కస్టడీలో విచారణ ఎదుర్కొంటున్నారు. దీనిలో భాగంగా సియా గోయల్‌ను పోలీసులు ఆదివారం ఉదయం 6.30 గంటలకు లోహగఢ్ కోటకు తీసుకువచ్చారు. పర్వతంపైనున్న ఈ కోట నుంచే కేతన్‌ను సియా తోసేసి చంపేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో హత్యకు సంబంధించిన వివరాల్ని సేకరించేందుకు పోలీసులు కోట వద్ద సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేశారు. సియాను తీసుకెళ్లి అక్కడ ఆమె ఎలా హత్య చేసిందో వివరంగా తెలుసుకున్నారు. ఈ సీన్ రీక్రియేషన్‌లో భాగంగా మనిషిని పోలిన ఒక బొమ్మను కూడా పోలీసులు పర్వతంపైనుంచి తోసేశారు. ఇక, పోలీసు కస్టడీలో విచారణలో సియా, చేతన్‌లు కీలక విషయాల్ని తెలిపారు. కేతన్ హత్యకు ముందు లోహగఢ్ కోటలో మర్డర్ రిహార్సల్స్ కూడా చేసినట్లు తేలింది. హత్య చేయడానికి కొద్ది రోజుల ముందు ఇద్దరూ కోటకు వెళ్లి ఏ ప్రదేశం నుంచి తోసేస్తే ఈజీగా చంపవచ్చు అనేది పరిశీలించారు. అనేక ప్రదేశాల్ని పరిశీలించి, అనువైన ప్రదేశాన్ని ఎంపిక చేసుకున్నారు. అతడిని తోసేసిన తర్వాత అది హత్యలా కాకుండా ప్రమాదంగా అనిపించేలా ఏ జాగ్రత్తలు తీసుకోవాలో ముందే ప్లాన్ చేశారు. అలాగే, కేతన్ హత్య అనంతరం పోలీసులు విచారణలో అడగబోయే ప్రశ్నలు ఏంటి.. వాటికి ఏం సమాధానం చెప్పాలో కూడా ముందుగానే సిద్ధమయ్యారు. అలాగే, హత్య చేసే విధానాల గురించి గూగుల్‌లో, యూట్యూబ్‌లో సెర్చ్ చేశారు. సియా, చేతన్ కలిసి చాలా పకడ్బందీగా హత్యకు ప్లాన్ చేశారు. ముఖ్యంగా పోలీసులకు చిక్కకుండా, అది హత్య అనిపించకుండా, ప్రమాదవశాత్తు జరిగినట్లు ఉండేలా మర్డర్ ప్లాన్ చేశారు. ఒకవేళ కేతన్‌కు విషం పెడితే ఎలా దొరకకుండా ఉండొచ్చో కూడా గూగుల్‌లో వెతికారు. ఇన్ని జాగ్రత్తలు తీసుకొని కేతన్‌ను హత్య చేసినప్పటికీ సియా, చేతన్ చివరకు పోలీసులకు చిక్కారు. ప్రస్తుతం పోలీసులు సియా, చేతన్‌ల డిజిటల్ ఫుట్‌ప్రింట్‌ను కూడా పరిశీలిస్తున్నారు.

# నిండు జీవితానికి రెండు చుక్కలు జీవితానికి రక్షణ, భవిష్యత్తుకు భరోసా

- డాక్టర్ బల్బీర్ సింగ్- మాతా శిశు సంరక్షణ కేంద్రంలో ఘనంగా పల్స్ పోలియో కార్యక్రమం
- చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ప్రారంభించిన చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ వేముల నరేందర్ రెడ్డి



**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)** సిద్దిపేట జిల్లా గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శ్రీగిరిపల్లి వైద్యాధికారి డాక్టర్ బల్బీర్ సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్ మాట్లాడుతూ, ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఆరోగ్య కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, "నిండు జీవితానికి రెండు చుక్కలు" అనే నినాదాన్ని ప్రతి తల్లిదండ్రులు గుర్తుంచుకుని తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బల్బీర్ సింగ్ మాట్లాడుతూ, "నిండు జీవితానికి రెండు చుక్కలు -- జీవితానికి రక్షణ, భవిష్యత్తుకు భరోసా" అని పేర్కొన్నారు. పిల్లలకు జలుబు, దగ్గు, జ్వరం ఉన్నప్పటికీ పోలియో చుక్కలు వేయించడంలో ఎలాంటి అభ్యంతరం లేదని, తప్పనిసరిగా వేయించాలని సూచించారు.

గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 29 పోలియో కేంద్రాలు, 4 ట్రాన్సిట్ బూత్‌లు ఏర్పాటు చేసి 138 మంది సిబ్బంది సేవలందిస్తున్నారని తెలిపారు. మొత్తం 4,720 మంది ఐదేళ్లలోపు చిన్నారులను లక్ష్యంగా పెట్టుకుని కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా తల్లిదండ్రులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గణేష్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పద్మాభాయ్ నర్సింగ్ రావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, 20వ వార్డు కౌన్సిలర్ అతెల్లి శ్రీనివాస్, సీహెచ్ఓ కాశీం, హెల్త్ అసిస్టెంట్ దేవసాని వాసుదేవ్, హెల్త్ సూపర్‌వైజర్ అనిత, రూట్ సూపర్‌వైజర్ రమేష్, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పిల్లల బంగారు భవిత కోసం పోలియో చుక్కలు వేయించాలి: కలెక్టర్ గరిమ అగ్రవాల్

- మరో రెండు రోజుల పాటు ఇంటింటికి తిరిగి వ్యాక్సిన్ పంపిణీ
- పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా వేయించాలి



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) పిల్లల బంగారు భవిత కోసం తల్లిదండ్రులు పోలియో చుక్కలు వేయించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. పోలియో వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని సుందరయ్య నగర్ అర్బన్ పీ హెచ్ సీ లో ఆదివారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ హాజరై పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ప్రభుత్వం పల్స్ పోలియో ప్రత్యేక శిబిరం పెట్టి వ్యాక్సిన్ పంపిణీ చేస్తుందని తెలిపారు. పోలియో రహిత దేశమని, 0 నుంచి 5 ఏండ్ల లోపు పిల్లలకు తప్పకుండా వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. పోలియో రహిత దేశం అలాగే కొనసాగాలని ఆకాంక్షించారు.పిల్లలు వ్యాక్సిన్ వేసుకుంటే భవిష్యత్తు లో కూడా పోలియో బారి నుంచి రక్షణ ఉంటుందని తెలిపారు. జిల్లాలో మొత్తం ఐదేండ్లలోపు 41,147 మంది పిల్లలు ఉన్నారని, వారందరికీ జిల్లా వ్యాప్తంగా 393 బూత్ లు ఏర్పాటు చేసి వ్యాక్సిన్ పంపిణీకి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయించామని వివరించారు. విద్యా శాఖ, జిల్లా సంక్షేమ శాఖ ప్రచారం, వైద్య ఆరోగ్య శాఖ వ్యాక్సిన్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని రద్దీ ప్రాంతాల్లో వ్యాక్సిన్ వేస్తారని పేర్కొన్నారు. మరో రెండు రోజులు వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి వ్యాక్సిన్ వేస్తారని తెలిపారు. ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసే వ్యాక్సిన్ పిల్లలకు వేయించాలని, దీంతో పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. ఆరోగ్యంగా ఉన్న పిల్లలు చదువు, ఆటల్లో రాణిస్తారని, వారి బంగారు భవితకు మేలు చేకూరుతుందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, డీఎం హెచ్ఓ ఏంజెలా ఆల్ఫ్రెడ్, డిప్యూటీ డీఎంహెచ్ఓ నాగేంద్ర బాబు, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, తహసీల్దార్ మహేష్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, డాక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 15వ వార్డ్‌లో 100% పోలియో రహిత లక్ష్యం కాంగ్రెస్ నేత నాగవత్ కిరణ్ పిలుపు



ఏటూరు నాగారం ( ప్రశ్న న్యూస్)మన దేశాన్ని పోలియో రహితంగా తీర్చిద్దడమే ప్రధాన లక్ష్యం.ఏటూరు నాగారం 15వ వార్డ్ కాంగ్రెస్ పార్టీ వార్డు మెంబర్ నాగవత్ కిరణ్.ఆదివారం 15వ వార్డ్‌లోని అంగన్వాడీ కేంద్రాలను, పోలియో బూత్‌లను ఆయన సందర్శించి ఆరోగ్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నగవత్ కిరణ్ మాట్లాడుతూ, 5 సంవత్సరాల లోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు.

### రెండు చుక్కలు - జీవితాంతం రక్షణ.

అని పేర్కొన్న కిరణ్ గారు, పోలియో వ్యాధికి మందు లేదని, కేవలం నివారణ మాత్రమే మార్గమని తెలిపారు. ఒకసారి వ్యాధి సోకితే శాశ్వత వైకల్యం సంభవించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ చుక్కలు పూర్తిగా ఉచితం, సురక్షితమైనవని ఆయన స్పష్టం చేశారు. జ్వరం, చిన్నపాటి అనారోగ్యం ఉన్న పిల్లలకు కూడా వైద్యుల సలహా మేరకు చుక్కలు వేయించవచ్చని చెప్పారు.

### కాంగ్రెస్ పార్టీ ప్రజారోగ్యానికి పెద్దపీట

కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజారోగ్యానికి ప్రాధాన్యత ఇస్తుందని తెలిపిన కిరణ్ గారు, 15వ వార్డ్‌లో ఒక్క బిడ్డ కూడా చుక్కలు మిస్ కాకుండా 100% కవరేజ్ సాధించడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. వార్డ్‌లోని ఆశా వర్కర్లు, సిబ్బంది, అంగన్వాడీ టీచర్లతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నామని వివరించారు.పోలియో నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి కుటుంబం సహకరించాలని, తమ పిల్లలతో పాటు పక్కింటి పిల్లలను కూడా బూత్‌లకు తీసుకువెళ్లాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, వార్డ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ధాన్యం అక్రమ తరలింపు వ్యవహారంలో కఠిన చర్యలు



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) బాధ్యులపై ఇప్పటికే క్రిమినల్ చర్యలు తీసుకున్న జిల్లా యంత్రాంగం, శాఖా పరమైన కఠిన చర్యలు చేపట్టింది.కోనరావుపేట మండలం మల్కపేట గ్రామంలో ఐకేపీ సెంటర్ బుక్ కీపర్‌గా పనిచేస్తున్న జంగిటి శ్రీనివాస్‌తో పాటు, సంబంధిత ఐకేపీ వీఓఏ పి.పర్శరాములు ను ఉద్యోగం నుండి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఐకేపీ సీసీ ఎస్.శ్రీదేవిని సస్పెండ్ చేశారు. అదేవిధంగా రుద్రంగి గ్రామంలో డీసీఎంఎస్ కొనుగోలు కేంద్రం నిర్వాహకుడు గడ్డం స్వామి, బద్దెనపల్లి గ్రామంలోని పీఏసీఎస్ నిర్వాహకుడు గాజుల నవీన్‌ను కూడా ఉద్యోగం నుండి తొలగించారు. జిల్లా పౌర సరఫరాల శాఖలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు రాజశేఖర్ మరియు వేణులను విధుల నుండి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.కోనరావుపేట మండల ఏపీఎం పి. రాజేశం, సిరిసిల్ల పీఏసీఎస్ సెక్రటరీ బి. నరేష్‌ను సస్పెండ్ చేశారు. అదేవిధంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియలో పర్యవేక్షణ లోపం కారణంగా జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి, మేనేజర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మరియు జిల్లా సహకార అధికారికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఆదిత్య లారీ ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్‌కు కూడా నోటీసులు జారీ చేసి, బ్లాక్ లిస్టు లో పెట్టడం జరిగింది. మానాల గ్రామంలోని గడ్డం స్వామి అలియాస్ గడ్డం నర్సారెడ్డి కి చెందిన అగ్రోస్ రైతు సేవా కేంద్రం యొక్క ఫర్టిలైజర్, సీడ్ లైసెన్సులను రద్దు చేశారు. మల్లికార్జున రైస్ మిల్, వేములవాడ పారిశ్రామిక లైసెన్స్ రద్దు కు సంబంధించి నోటిసులు జారీ చేసారు.

రెవిన్యూ డివిజనల్ అధికారి, సిరిసిల్ల నేతృత్వం లోని కమిటి విచారణ ఆధారంగా తదుపరి చర్యల నిమిత్తం నివేదికను పౌర సరఫరాల శాఖ ఉన్నతాదికారులకు పంపించటం జరుగుతుంది. అలాగే ధాన్యం దారి మళ్లింపు అంశంపై అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పూర్తి స్తాయి విచారణ నివేదిక అందిన వెంటనే, సంబంధిత బాధ్యులపై మరిన్ని కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్పష్టం చేశారు.

## మెదక్‌లో బీజేపీ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవం

- ఎంపీ రఘునందన్ రావు



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) మెదక్ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన బీజేపీ పార్టీ కార్యాలయాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్క కార్యకర్తకు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో కుల్చారం మండలం బిజెపి మండల పార్టీ అధ్యక్షులు పంతులు హరీష్ బిజెపి పార్టీ జిల్లా కౌన్సిల్ మెంబర్ ఎంచర్ల శేఖర్ యాదవ్, కిష్టాపురం గ్రామ సర్పంచ్ స్వప్న ఉశయ్య, ఉప సర్పంచ్ చందపురం నిర్మల శేఖర్ యాదవ్, బిజెపి నాయకులు మల్కే శ్రీశైలం యాదవ్, ఎంబరి శీను, బిజెపి కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పోలియో రహిత భారత్ కోసం అందరూ సహకరించాలి

- విలాసాగర్ సర్పంచ్ : ఏనుగుల కనుకయ్య



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని విలాసాగర్ గ్రామంలో ఆదివారం పల్స్ పోలియో--2026 కార్యక్రమాన్ని సర్పంచ్ ఏనుగుల కనకయ్య, ఉపసర్పంచ్ పొత్తూరి శైలజ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.సర్పంచ్ ఏనుగుల కనకయ్య మాట్లాడుతూ, 0--5 సంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, పోలియో వంటి ప్రాణాంతక వ్యాధి నుంచి పిల్లలను రక్షించేందుకు ప్రతి తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. "రెండు చుక్కలు వేయండి... మీ పిల్లల భవిష్యత్తును రక్షించండి" అంటూ పోలియో రహిత భారత్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు పోలే శేఖర్, యువజన కాంగ్రెస్ నాయకుడు ఏనుగుల ప్రశాంత్, పీహెచ్‌సీ వైద్యులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ కార్యదర్శి శేఖర్‌తో పాటు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చిన్నారుల ఆరోగ్యమే దేశ భవిష్యత్తు

- పల్స్ పోలియో చిన్నారులకు రక్షణ కవచం
- బోయినిపల్లి గ్రామ సర్పంచ్ : నల్ల మోహన్



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల కేంద్రంలో ఆదివారం జాతీయ పల్స్ పోలియో--2026 కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ నల్ల మోహన్ ప్రారంభించారు. గ్రామ పంచాయతీ భవనంలో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రంలో ఐదేళ్లలోపు చిన్నారులకు ఆయన స్వయంగా పోలియో చుక్కలు వేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ నల్ల మోహన్ మాట్లాడుతూ, "పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి తల్లిదండ్రి బాధ్యతగా ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి. ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమానికి ప్రజలు పూర్తి సహకారం అందించాలి. ఒక్క చిన్నారిని కూడా మిస్ కాకుండా సమీప పోలియో కేంద్రానికి తీసుకువచ్చి చుక్కలు వేయించాలని" కోరారు. చిన్నారుల ఆరోగ్యమే దేశ భవిష్యత్తుకు బలమైన పునాది అని, పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామ ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## పోలియో నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం కీలకం

- పిల్లల ఆరోగ్య రక్షణకు పోలియో చుక్కలే భరోసా
- బోయినిపల్లి ఏఎంసీ చైర్మన్ : బోయిని ఎల్లేష్ యాదవ్



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందించి పోలియో రహిత సమాజ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని బోయినిపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్ అన్నారు. జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా బోయినిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలియో నిర్మూలనలో దేశం సాధించిన విజయాన్ని కొనసాగించాలంటే ప్రతి తల్లిదండ్రి బాధ్యతగా తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని కోరారు. పోలియో చుక్కలు పూర్తిగా సురక్షితమైనవని, ఒక్క చిన్నారి కూడా మిస్ కాకుండా ఆరోగ్య శాఖ అధికారులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది సమన్వయంతో ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలని సూచించారు. బోయినిపల్లిని పోలియో రహిత మండలంగా నిలబెట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మెరుపుల చందన జలంధర్, వార్డు సభ్యులు చౌదరి శ్రీధర్,అమ్మిగల్ల గోపాల్,నాయకులు మెరుపులు జలంధర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. కార్తీక్, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## నిండు జీవితానికి రెండు చుక్కలు పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- గ్రామ సర్పంచ్ సాదుల స్వప్న ఉశయ్య



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) కొల్చారం మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామంలో ఆదివారం నాడు గ్రామపంచాయతీ ఆవరణలో ఐదేళ్లు లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన గ్రామ సర్పంచ్ సాదుల స్వప్న ఉషయ్య ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందించడం అందరి బాధ్యత అని గ్రామ సర్పంచ్ తెలిపారు జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం కొల్చారం మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో గ్రామపంచాయతీ ఆవరణలో ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ..పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజల సహకారం ఎంతో అవసరమని అన్నారు.చిన్నారుల ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు రెండు పోలియో చుక్కలే రక్షణ కవచమని అన్నారు.జిల్లాలోని ప్రతి ఐదేళ్లలోపు చిన్నారికి పల్స్పోలియోకార్యక్రమంలో తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. చిన్నారుల ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం తల్లిదండ్రులందరూ బాధ్యతగా తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని విజ్ఞప్తి చేశారు. పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చందపురం నిర్మల శేఖర్ యాదవ్ అంగన్వాడి టీచర్లు శ్రీ మతమ్మ, శోభ, ఆశ వర్కర్ నాశమ్మ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ‘మండాడి’లో సాట్టపులిగా..



సుహాస్, సూరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తమిళ చిత్రం ‘మండాడి’. స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి మదిమారన్ పుగళేంది దర్శకుడు. వెట్రిమారన్ క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. మత్స్యకారుల నేపథ్యంలో సాగే కథ ఇది. సెప్టెంబర్ 4న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో ఇటీవల మేకింగ్ వీడియోను విడుదల చేశారు. ఇందులో సాట్టపులిగా సుహాస్ రా అండ్ రస్టిక్ లుక్‌లో కనిపిస్తున్నారు. రియల్ లొకేషన్స్‌లో ఈ సినిమాను తీశామని, యాక్షన్ ఘట్టాలు హైలైట్‌గా నిలుస్తాయని మేకర్స్ తెలిపారు. మహిమా నంబియార్, సత్యరాజ్, రవీంద్ర విజయ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్‌కుమార్, నిర్మాత: ఎల్రెడ్ కుమార్, దర్శకత్వం: మదిమారన్ పుగళేంది

# ‘ఆ పాత్రను రిజెక్ట్ చేయడం నా అదృష్టం’..

## ‘కల్కి’లో బుజ్జిగా మారిన కీర్తి సురేశ్ ఆసక్తికర వ్యాఖ్యలు!



ఖవవతీస్త్రం ాాబతీవంష్ట్ర । ప్రపంచవ్యాప్తంగా సంచలన విజయాన్ని అందుకుని భారతీయ సినీ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న సైన్స్ ఫిక్షన్ చిత్రం ‘కల్కి 2898 ఏడీ’ విడుదలై రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఆ సినిమాలో అత్యంత ప్రత్యేకమైన పాత్రగా నిలిచిన ‘బుజ్జి’ గురించి ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. భైరవకు అత్యంత సన్నిహిత మిత్రుడిగా,ఏఐతో పనిచేసే స్మార్ట్ వాహనంగా కనిపించిన బుజ్జికి తన స్వరాన్ని అందించిన జాతీయ అవార్డు గ్రహీత కీర్తి సురేశ్ తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు.మలయాళ చిత్రం ‘గీతాంజలి’తో హీరోయిన్‌గా కెరీర్ ప్రారంభించిన కీర్తి సురేశ్, ‘నేను శైలజ’ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. అనంతరం వరుస విజయాలతో స్టార్ హీరోయిన్‌గా ఎదిగిన ఆమె, ‘మహానటి’ చిత్రంలో సావిత్రి పాత్రలో అద్భుత నటన కనబర్చి జాతీయ ఉత్తమ నటి అవార్డును అందుకున్నారు. నటనకు ప్రాధాన్యమున్న పాత్రలను ఎంచుకుంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించిన కీర్తి, ‘కల్కి 2898 ఏడీ’లో తెరపై కనిపించకపోయినా తన గాత్రంతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. తాజా ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ దర్శకుడు నాగ్ అశ్విన్ మొదట తనకు సినిమాలో మరో ఆన్–స్క్రీన్ పాత్రను ఆఫర్ చేసినట్లు వెల్లడించారు. అయితే ఆ పాత్ర తనను అంతగా ఆకట్టుకోలేదని, అందుకే దానిని సున్నితంగా తిరస్కరించినట్లు తెలిపారు. నేను ఆ పాత్రను తిరస్కరించిన తర్వాత నాగ్ అశ్విన్ నాకు మెసేజ్ చేసి ‘కనీసం నా సినిమాలో ఒక గోడ చాటు నుంచి అయినా తొంగి చూస్తావా?’ అని అడిగారు. ఆయన సినిమాలో నేను ఏదో ఒక రూపంలో భాగమవుతానని నాకు నమ్మకం ఉండేది. ఇప్పుడు ఆ పాత్రను తిరస్కరించడం వల్లే బుజ్జి లాంటి ప్రత్యేక పాత్ర నాకు దక్కిందని అనిపిస్తోంది అని కీర్తి తెలిపారు. బుజ్జి పాత్ర గురించి తొలిసారి చెప్పినప్పుడు తాను కొంత ఆశ్చర్యపోయానని ఆమె వెల్లడించారు.

# ‘నాగబంధం’

## రథయాత్ర చాలా ప్రత్యేకం!

సాఫ్ట్‌వేర్ రంగంలో విజయవంతంగా రాణించిన కిషోర్ అన్నపురెడ్డి, నిశిత నాగిరెడ్డి దంపతులు ‘నాగబంధం’ చిత్రం ద్వారా సినీ నిర్మాతలుగా అరంగేట్రం చేస్తున్నారు. కేవలం డబ్బుకోసమే ఇండస్ట్రీకి రాలేదని, ఐటీ ఫీల్డ్‌లో తాము కావాల్సినంత గుర్తింపు పొందామని, వ్యాపారాన్ని విస్తరించే క్రమంలో సినిమా గొప్ప వేదికగా కనిపించిందని వారు చెప్పారు. విరాట్‌కర్ణ హీరోగా అభిషేక్ నామా దర్శకత్వంలో రూపొందిన డివైన్ అడ్వెంచర్ థ్రిల్లర్ ‘నాగబంధం’ జూలై 3న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా కిషోర్ అన్నపురెడ్డి, నిశిత నాగిరెడ్డి శనివారం పాత్రికేయులతో సినిమా విశేషాల్ని పంచుకున్నారు.మేమిద్దరం ఐఐటీ గ్రాడ్యుయేట్స్. ఐటీ నుంచి వచ్చినా...క్రియేటివ్ ఫీల్డ్ అయిన సినిమాపై తొలి నుంచి ఆసక్తి ఉంది. నిర్మాత రవీందర్ రెడ్డి ద్వారా దర్శకుడు అభిషేక్ నామాను కలిసి కథ విన్నాం. ఆయన విజన్ బాగా నచ్చడంతో ఈ ప్రాజెక్ట్‌లోకి ఎంటరయ్యాం. కథపై ఉన్న



నమ్మకంతో 110కోట్ల బడ్జెట్‌తో సినిమా తీశాం.రెండు కాలల నేపథ్యంలో నడిచే పీరియాడిక్ సినిమా ఇది. విజువల్స్ ప్రేక్షకుల్ని మంత్రముగ్ధుల్ని చేస్తాయి. భారీ సెట్స్‌లో చిత్రీకరణ జరిపాం. ప్రతీ పదినిమిషాలకొక అద్భుతమైన విజువల్ తెరపై కనిపిస్తుంది. ఈ సినిమా కోసం వేసిన పద్మనాభస్వామి ఆలయం సెట్‌ని చూసిన అందరూ నిజమైన ఆలయానికి వచ్చిన అనుభూతి కలిగిందని చెప్పారు.ఈ సినిమా ప్రమోషన్స్‌ని కూడా వినూత్నంగా నిర్వహించాం. పద్మనాభస్వామి రథయాత్ర రూపంలో చేసిన ప్రచార కార్యక్రమాలు అందరి దృష్టిని ఆకర్షించాయి. ఇది చాలా ప్రత్యేకమని, ఈ తరహా ప్రమోషన్ ఎవరూ చేయలేదనే ప్రశంసలొచ్చాయి. ఈ పాన్ ఇండియా సినిమాకు అన్ని భాషల నుంచి అద్భుతమైన స్పందన వస్తున్నది. బాలీవుడ్ విశ్లేషకులు ట్రైలర్ చూసి ప్రామిసింగ్‌గా ఉందని చెప్పారు.సినిమా ఆశించిన విజయం సాధిస్తే తప్పకుండా సీక్వెల్ తెరకెక్కిస్తాం. ఈ సినిమా విడుదలైన తర్వాత కొత్త కథలు వింటాం.



# ‘రాకా’లో రష్మిక?

‘పుష్ప’ ఫ్రాంఛైజీలో పుష్పరాజ్, శ్రీవల్లి జోడీ ప్రేక్షకుల్ని ఎంతగానో ఆకట్టుకుంది. ఈ ఇద్దరు మరోమారు వెండితెరపై సందడిచేయబోతున్నట్లు వార్తలొస్తున్నాయి. అల్లు అర్జున్ కథానాయకుడిగా అట్లీ దర్శకత్వంలో సైన్స్ ఫిక్షన్ ‘రాకా’ రూపొందుతున్న విషయం తెలిసిందే.

ఇందులో దీపికా పడుకోన్ కథానాయికగా నటిస్తున్నది. ఈ సినిమాలో మరో నాయికకు చోటుందని, కథాగమనంలో ఆమెది అత్యంత కీలకమైన పాత్ర అని చెబుతున్నారు. ఈ క్యారెక్టర్ కోసం రష్మిక మందన్నను ఎంపిక చేశారని ప్రచారం జరుగుతున్నది.

మానవాతీత శక్తులు కలిగిన యువతిగా ఆమె పాత్ర కథాగమనంలో కీలకంగా ఉంటుందని అంటున్నారు. అయితే ఈ విషయంలో చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ సినిమాలో రష్మికతో పాటు మృణా ల్ ఠాకూర్, జాన్వీకపూర్ కూడా కీలక పాత్రల్ని పోషించబోతున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. సన్‌పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది ప్రథమార్ధంలో ప్రేక్షకుల ముందుకురానుంది.

# వినోదప్రధానంగా ‘జోకర్’



మౌర్య, తన్వీ జంటగా నటిస్తున్న ‘జోకర్’ చిత్రం శనివారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. గీత సి శేఖర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మీరా ప్రొడక్షన్స్ పతాకంపై సందీప్ రామినేని నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి అగ్ర నిర్మాత అల్లు అరవింద్ క్లాప్‌నివ్వగా, అల్లు స్నేహ కెమెరా స్విఛాన్ చేశారు. ఆద్యంతం వినోదాత్మకంగా సాగే చిత్రమిదని, ఆగస్ట్ నుంచి షూటింగ్ ప్రారంభిస్తామని, త్వరలో నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను వెల్లడిస్తామని దర్శకనిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి సురేష్ రగుతు ఛాయాగ్రాహకుడిగా పనిచేస్తున్నారు.

# హస్మత్ పేటలో భస్మాసురుడు హస్తం:ఈటెల

## గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో ఘనంగా పల్స్ పోలియో కార్యక్రమం

**- మున్సిపల్ 2వ వార్డులో చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తుంకుంట ఆంక్షరెడ్డి**



**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)** సిద్దిపేట జిల్లా గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డులో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు తుంకుంట ఆంక్షరెడ్డి, మాజీ వార్డు కౌన్సిలర్ షహనాజ్ సమీర్, కాంగ్రెస్ మైనారిటీ సెల్ మాజీ జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ సమీర్ పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తుంకుంట ఆంక్షరెడ్డి మాట్లాడుతూ, ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆరోగ్య కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వార్డు పరిధిలోని ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు అందేలా వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రతి చిన్నారి ఆరోగ్యమే కుటుంబానికి, సమాజానికి భరోసా అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాలనీ పెద్దలు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, తల్లిదండ్రులు తమ చిన్నారులతో కలిసి పాల్గొని పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పేదల పక్షాన మేమున్నాం:ముద్దం నర్సింహా యాదవ్



**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)** సికింద్రాబాద్ బోయిన్ పల్లి హస్మత్ పెట్ సర్వే నెంబరు 1 లోని ప్రభుత్వ భూమిలో నిన్న హైడ్రా కూల్చివేతలు చేపట్టిన నేపథ్యంలో బిఆర్ఎస్ బాధితుల పక్షాన నిలుస్తుందని మాజీ ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ప్రభుత్వ భూమిగా చెబుతున్న సర్వే నెంబరు 1 లో ఉన్న పేదల ఇళ్ళను హైడ్రా కూల్చివేయడం సరికాదని అన్నారు. పేద ప్రజలను ఇబ్బందులకు గురి చేయకుండా వారి ఇల్ల జోలికి వెళ్ల వద్దని అన్నారు. అవసరమైతే జిల్లా కలెక్టర్ ను రెవెన్యూ అధికారులను హైడ్రా కమిషనర్ను కలిసి బాధితుల పక్షాన తాము నిలబడతామని స్పష్టం చేశారు. పేద ప్రజలను తప్పుదోవ పట్టించి దళారులు మోసం చేస్తే వారిపై కూడా చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఏ పార్టీ వారైనా ఉపేక్షించవద్దని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ తీసుకొని అదే స్థలంలో పేదలకు ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేద ప్రజలకు అన్ని విధాల సహకారం అందిస్తామని, రాజకీయ నాయకులకు దళారులకు చెందిన భూములను హైడ్రా స్వాధీనం చేసుకుంటే తమకు అభ్యంతరం లేదని అన్నారు. అలాగే స్థానిక ప్రజలను ఇబ్బందులకు గురి చూసే విధంగా హైడ్రా వ్యవహరించడం సరికాదని, తొలగించిన కరెంట్, మంచి నీటి సౌకర్యాలు కల్పించాలన్నారు. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణ రావ్, మాజీ కార్పొరేటర్ గా నేను సంఘటన స్థలంలో జరిగిన అన్యాయాన్ని ప్రజల నుంచి అడిగి తీసుకుంటామని, వీలైనంత త్వరగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ముద్దం నర్సింహా యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ డివిజన్ అధ్యక్షుడు ఇర్ఫాన్ బాయ్, భారాసా పార్టీ డివిజన్ జనరల్ సెక్రటరీ మేకల హరినాథ్, బిసి సెల్ అధ్యక్షుడు మట్టి శ్రీను, పోచయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుర్రి యాదగిరి, చందు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా
# పోలియో చుక్కలు వేయించాలి



ఎల్లారెడ్డిపేట (ప్రశ్న న్యూస్) పిల్లల బంగారు భవిత కోసం తల్లిదండ్రులు పోలియో చుక్కలు వేయించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. పోలియో వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమాన్ని వెంకటాపూర్ గ్రామంలోని గ్రామపంచాయతీలో ఆదివారం నిర్వహించగా, పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ప్రభుత్వం పల్స్ పోలియో ప్రత్యేక శిబిరం పెట్టి వ్యాక్సిన్ పంపిణీ చేస్తుందని తెలిపారు. పోలియో రహిత దేశమని, 0 నుంచి 5 ఏండ్ల లోపు పిల్లలకు తప్పకుండా వ్యాక్సిన్ వేయించాలని తెలియజేశారు. పోలియో రహిత దేశం అలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. పిల్లలు వ్యాక్సిన్ వేసుకుంటే భవిష్యత్తు లో కూడా పోలియో బారి నుంచి రక్షణ ఉంటుందని తెలిపారు. మరో రెండు రోజులు వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి వ్యాక్సిన్ వేస్తారని తెలిపారు. ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసే వ్యాక్సిన్ పిల్లలకు వేయించాలని, దీంతో పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని తెలియజేశారు. ఆరోగ్యంగా ఉన్న పిల్లలు చదువు, ఆటల్లో రాణిస్తారని, వారి బంగారు భవితకు మేలు చేకూరుతుందని వైద్యులు వివరించారు. కార్యక్రమంలో ఎం.ఎల్.హెచ్.పి లక్ష్మి ప్రసన్న, ఏ ఎన్ ఎం స్వప్న, అంగన్వాడి టీచర్ నీలిమ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** సికింద్రాబాద్ హస్మత్ పెట్ సర్వే నెంబరు "1"లోని ప్రభుత్వ భూమిలో నిన్న హైడ్రా కూల్చివేతలు చేపట్టిన నేపథ్యంలో మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ బాధితులను పరామర్శించి వారికి భరోసా కల్పించారు. హాస్మత్ పెట్ వద్ద బాధితులతో మాట్లాడిన ఎంపీ ఈటల రాజేందర్ బాధితుల పక్షాన ఉంటామని పేదల ఇల్లు కూలిస్తే సహించేది లేదని హెచ్చరించారు. హైడ్రా బాధితులు ఎంపీ ఈటెల తో వారి బాధలను చెప్పుకొని కన్నీటి పర్యంతం కాగా ఆయన వారిని ఓదార్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అండ చూసుకొని రంగనాథ్ పేదల ఇళ్లను యదేచ్ఛగా కూలుస్తున్నారని పేదల ఉసురు తగులుతుందని ఎంపీ ఈటెల అన్నారు. హస్మత్ పేటలో ఉన్న భూమి పురావస్తు శాఖ, ప్రభుత్వమా లేదా ప్రైవేట్ వ్యక్తులదా అనే అంశం పై రెవెన్యూ అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కోర్టు ఎన్నిసార్లు మందలించినప్పటికీ హైడ్రా తీరు మారడం లేదని ఆక్షేపించారు. పేదల ఇండ్ల జోలికి వెళ్లకుండా రాజకీయ నాయకులు దళారుల చేతులలో ఉన్న భూములను హైడ్రాస్వాదినం చేసుకోవాలని కోరారు. దళారులు ఎవరైనా పేదలను నమ్మించి వారికి స్థల విక్రయాలు చేస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని అన్నారు. వివాదాలలో ఉన్న భూములను పేద మధ్యతరగతి ప్రజలు కొనుగోలు చేసే ముందు ఒకటికి పది సార్లు ఆలోచన చేసి తీసుకోవాలని సూచించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ ప్రజా ప్రతినిధులు అధికారుల నిర్లక్ష్యం మూలంగానే పేద ప్రజల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పేదలకు ఇలాంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాన్ని దేనని లేని పక్షంలో భాజాపా పెద్ద ఎత్తున పోరాటాలకు దిగుతుందని ఆయన హెచ్చరించారు.

### సర్వే నెంబర్ "1"నుంచి సిఎంకి హైడ్రా కమీషనర్‌కి వార్నింగ్:ఈటెల రాజేందర్.

మిస్టర్ రంగనాథ్ నీకు రేవంత్ రెడ్డి అండ ఉందని ఇష్టం వచ్చినట్టు పేదల ఇళ్లు కూలగొడుతున్నావు, కానీ ప్రజల ఉసురు తగులుతుందని మర్చిపోకు. కోర్టు ఎన్నిసార్లు మొట్టి కాయలు వేసినా శనివారమే కూలుస్తున్నావు, న్యాయస్థానాల మీద నీకు గౌరవం ఉందా? లేదా ? అని ఆయన ప్రశ్నించారు. మానవత్వం ఉన్నవాడు ఎవడు ఈ పని చేయడన్నారు. హైడ్రాకు అధికారులను, భూకబ్జా దారులను శిక్షించే దమ్ము లేదు. రాజకీయ నాయకుల పేరు ఎత్తే దమ్ము కూడా లేదు. కానీ నోరులేని జీవులు పేదల ఇల్లు కూలుస్తున్నారు. బయటి దేశస్థుడు దాడి చేసినట్టు హైడ్రా దాడి చేస్తుందని ఆయన అన్నారు. ఇంతకు ముందు కూడా రేవంత్ రెడ్డి లాంటి సీఎం ఉండి ఉంటే హైదరాబాదులో బస్తీలు ఉండేవి కావు, పేదలకు గూడు ఉండేది కాదు. ఇందిరమ్మ రాజ్యమంటే పేదల ఇళ్లను కూలగొట్టడమా ? పేదలతో గోక్కున్న నీ ప్రభుత్వాన్ని బొంద పెట్టడం ఇక ఖాయం. హైదరాబాద్ బస్తీలలో ఉన్న పేదలంతా నీ భరతం పడతారు. జంటనగరాల్లో ఇక నీకు ఓటమి తప్పదు. పేద ప్రజలారా వివాదాస్పద భూములను కొనుగోలు చేయకండి, ఇబ్బందులు పడకండి. అన్ని చూసి కొనుగోలు చేయండి.

### ఛత్రి స్థలంలో ఈటెల రాజేందర్ ధర్నా:

బోయినపల్లి డివిజన్ అస్మత్ పేటలో నిన్న హైడ్రా కూల్చివేతలకు నిరసనగా ధర్నా నిర్వహించిన మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్. బాధితులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారికి మద్దతుగా మాట్లాడుతూ, అస్మత్ పేట గ్రామం సర్వేనెంబర్1లో ఉన్న భూమిని కొంతమంది ఆర్కియాలజీ డిపార్ట్మెంట్ భూమని, ఎక్కువ మంది ప్రభుత్వ భూమి అని, మరికొందరు ప్రైవేట్ భూమి అని చెప్తున్నారు. ఇది ఎవరి భూమి అని తేల్చాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులదే. హైడ్రా వచ్చిన మొదట్లో చెరువులను, మురికి కాలువలను, వరద కాలువలను కాపాడుతుంది అని అనుకున్నారు. భూ కబ్జాదారులు ప్రభుత్వ భూములను కబ్జా చేయకుండా కాపాడుతుంది అనుకున్నాము. కానీ అతి తక్కువ కాలంలోనే హైడ్రా తన నిజ స్వరూపాన్ని బయటపెట్టింది. హైడ్రా కనికరం లేకుండా కన్నీళ్లు కారుతున్నా, ఆర్తనాదాలు పెడుతున్న పేదలు కట్టుకున్న పిచుక గుళ్ళను కళ్ళముందే నేలమట్టం చేస్తున్నారు. ప్రజలు శాపనార్థాలు పెట్టడమే తప్ప ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో అమాయకులు ఉన్నారు. హైడ్రాకు దమ్ము లేదు దొంగ చాటుగా కోర్టు సెలవు దినాల్లో కూలగొడుతున్నారు. ప్రభుత్వ భూమా ? ప్రైవేటు భూమా ? ఎంక్వయిరీ చేయాలి. ప్రభుత్వ భూమి అయితే దీనిని ఎవరు లే అవుట్ చేశారు. బ్రోకర్ ఎవరు, వారికి సహకరించిన అధికారులు ఎవరు ? సహకరించిన రాజకీయ నాయకులు ఎవరు తేల్చి వారి మీద కేసులు పెట్టాలి. దమ్ముంటే సర్కార్, హైడ్రా వారిని జైల్లో పెట్టాలి. హైడ్రాకు అధికారులను, భూకబ్జా దారులను శిక్షించే దమ్ము లేదు. రాజకీయ నాయకుల పేరు ఎత్తే దమ్ము కూడా అంతకన్నా లేదు. కానీ నోరులేని పేద ప్రజల ఇల్లు కూలుస్తున్నారు. మొన్న శనివారం అయితే కోర్టు ఉండదని, సాయంత్రం పూట వచ్చి కూల్చుతున్నారు. పేదలు కోర్టు మెట్లు ఎక్కి న్యాయం కావాలని ఎక్కడ కోరతారోనని, పేదల పక్షాన కోర్టు ఎక్కడ ఉంటుందో అని భావించి కోర్టు లేని నాడు శనివారం ఆదివారం ఇట్లాంటి దుర్మార్గమైన పనులు చేస్తున్నారు. ఇక్కడ ఉన్నవారి కులం పేదరికం, మతం కష్టపడి పనిచేసి ఇంటిని పోషించుకోవడం. 70 ఏళ్ళలో రేవంత్ రెడ్డి లాంటి ముఖ్యమంత్రి ఉండి ఉంటే హైదరాబాదులో ఇన్ని బస్తీలు వచ్చి ఉండేవి కావు. ఇంతమంది పేదవారు గూడు వేసుకుని బ్రతికే పరిస్థితి ఉండేది కాదు. ఇందిరమ్మ రాజ్యమంటే పేదల ఇళ్లను కూలగొట్టడమా ? అని ఆయన ఈ సందర్భంగా ప్రశ్నిస్తున్నాను. దిక్కులేని వాళ్లే 60 గజాల ఇళ్లల్లో ఉంటున్నారు. చచ్చిపోతే శవాన్ని ఇంటి ముందు పెట్టుకోవాలని ఉద్దేశంతో ఒక తరం కష్టపడితే ఇంత జాగా కొనుక్కుంటున్నారు. కాయ కష్టం చేసి, ఉపాసం ఉండి, పిల్లల కోరికలను చంపుకొని, కనిపించిన అమ్మానాన్నలను వదిలిపెట్టి బస్తీకి వచ్చి పైసా పైసా జమచేసి అస్మత్ పేటలో ఇల్లు కొనుక్కున్న వారి ఇళ్లను కూలగొడితే వారు ఎటు పోవాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వానికి మానవత్వం ఉంటే, సోయి ఉంటే, భార్యా పిల్లలు ఉంటే, గతంలో ఈ భూములను లే అవుట్ చేస్తున్న వారిని, అమ్ముతున్న వారిని, నివారించే, పేదవాళ్లను బలి చేసిన వారిని అరెస్టు చేయాల్సి బాధ్యత రెవెన్యూ అధికారుల పై ఉందన్నారు. ఇక్కడ ఉన్న వాళ్ళల్లో ఇంటి పన్ను కట్టే వాళ్ళు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఇలా కూలకొట్టుకుంటూ పోతే హైదరాబాదులో ఒక్క బస్తి కూడా మిగలదు. సిఎం నీకు బుద్ధి జ్ఞానం ఉందా.?గత ప్రభుత్వం జీఓ నెంబర్ 58,59 తెచ్చింది కదా. దాని ప్రకారమే చాలామంది రెగ్యులరైజ్ చేసింది కదా. పేదల ఇళ్ళు కూలిస్తే.. మీ ప్రభుత్వాన్ని కూల్చివేస్తారు అని హెచ్చరిస్తున్నా. మళ్ళీ 2028 లో ఎన్నికలకు రావా ? చేతిలో అధికారం ఉందని మానవత్వం లేకుండా, కరెంటు, నీళ్లలైన్లు కట్ చేయవచ్చు కానీ ఇది ఊరికే పోదు, భవిష్యత్తులో మూల్యం చెల్లించాల్సిందే. హైదరాబాద్ బస్తీలలో నివసించే బతకవచ్చిన పేద వారంతా ఈ హాస్మత్ పేట బాధితులకు అండగా ఉంటారు. ఇక్కడ ఇళ్లు కట్టుకొని ఉంటున్న వారికి ఎంక్వయిరీ చేసి శాశ్వత సర్టిఫికెట్ ఇవ్వాల్సింది పోయి కూల్చడం ఏమిటి. పేదలకు అన్యాయం చెయ్యకుండా ఆల్టనెంట్ దారి చూపించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. కొనుక్కున్న నిజమైన పేదవారిని గుర్తించే దమ్ము నీకు లేదా ? బ్రోకర్లు ఉంటే కేసులు పెట్టీ డబ్బులు వసూలు చేయండి. కబ్జా దారులు ఉంటే వెళ్లగొట్టి ఆ భూమిలో పేదలకు ఇళ్లు కట్టి ఇవ్వండి. పెదవాళ్ళతో గోక్కుంటే బాగుపడరు. బయటి దేశస్థుడు దాడి చేసినట్టు హైడ్రా దాడి చేస్తుంది. కాపాడే వాడే కాలయముడు లెక్క కాటు వేస్తున్నాడు. ఇళ్లు కట్టించాల్సిన ప్రభుత్వమే ఇళ్లు కూల్చి వేస్తుంది. మనిషి అంటే మానవత్వం ఉంటుంది. మనిషి అంటే ఆదుకొనే వాడు తప్ప, మానవత్వం ఉన్న వాడు ఇలా చేయడు. పోలీసులు కూడా అధికారులు పిలవగానే వచ్చి కూలగొడితే ఆ ఉసురు మీకు కూడా తగులుతుందని గుర్తు చేశారు. మీరు ఉన్నది దొంగలని పట్టుకోవడం జైల్లో పెట్టడానికి. అక్రమ దారులను పట్టుకోవడానికి తప్ప పేదల ఇళ్లను కూల్చివేస్తుంటే కాపలా కాసే డ్యూటీ కాదు. రంగనాథ్ నీకు కోర్టు ఎన్నికలు మొట్టికాయలు వేసినా. సిఎం రేవంత్ రెడ్డి అండ ఉంది అని అనుకుంటున్నావు. కానీ ప్రజల శాపం ఉంటుంది అని మర్చిపోవద్దు. ఇది మంచిది కాదు. పేదవాడి ఇంటిని కూల్చి వేస్తే ఆ బాధ్యత నీదే. ఇది ఆపకపోతే హైదరాబాద్ లో ఉన్న బస్తీలన్నీ ఏకం చేస్తాం. ఈ ప్రభుత్వాన్ని గద్దె దించేవరకు వదలం. మీ అందరికీ మేము అండగా ఉంటామని మరో సారి సభాముఖంగా హామీ ఇస్తున్నామని ఈటెల తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిజెపి నాయకులు ఏనుగుల తిరుపతి, పప్పు పటెల్, రమేష్, శేఖర్, హర్జీత్ సింగ్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

### నూటికి నూరు పాళ్ళు ఎమ్మెల్యే,కార్పొరేటర్ దే ఈ పాపం: ఏనుగుల తిరుపతి.

రెక్కాడితే డొక్కాడని నిరుపేద ల చెమటను సొమ్ము చేసుకున్న స్థానిక ఎమ్మెల్యే, డివిజన్ కార్పొరేటర్. ఈ పేద ప్రజల కన్నీటి గాథలు వింటే ప్రతి వ్యక్తి హృదయం చలించక తప్పదని, వారి ఆవేదన చూస్తుంటే న్యాయం జరగకపోతే భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది అని ఆవేదనతో అరణ్యరోధనతో బాధపడుతున్నారు. ముఖ్యంగా ఎమ్మెల్యే, కార్పొరేటర్ కలిసి భరోసా ఇవ్వకపోతే స్థలాలు కొనే వాళ్ళు కాదని, ప్రస్తుతం హైడ్రా పేదలు నిర్మించుకున్న పిచుక గుళ్ళను జెసిబీ చక్రాల కింద నలిగిపోతుంటే వారి కన్నీళ్లతో ఆర్తనాదాలు చేస్తున్నారు. ఇంత తంతుగా జరుగుతున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్ రాకపోవడంతో సిగ్గు చేటు, గతంలో కొందరికి రిజిస్ట్రేషన్లు, మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేశారు. సర్కార్ ఇక్కడ ఉన్న పేద ప్రజలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి, అలాగే బిఆర్ఎస్ పార్టీ బ్రోకర్లు వల్లే ఈ తతంగం జరిగింది కాబట్టి అవసరమైతే వాళ్ల ఇంటి ముందు ధర్నా చేస్తామని భాజపా సీనియర్ నాయకులు ఏనుగుల తిరుపతి అన్నారు. హస్మత్ పేట సర్వే నెంబర్ 1 లో ఉన్న నిరుపేదలకు న్యాయం జరిగేవరకు భాజపా నాయకులు అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు.

### నూటికి నూరు పాళ్ళు ఎమ్మెల్యే,కార్పొరేటర్ దే ఈ పాపం: ఏనుగుల తిరుపతి.

రెక్కాడితే డొక్కాడని నిరుపేద ల చెమటను సొమ్ము చేసుకున్న స్థానిక ఎమ్మెల్యే, డివిజన్ కార్పొరేటర్. ఈ పేద ప్రజల కన్నీటి గాథలు వింటే ప్రతి వ్యక్తి హృదయం చలించక తప్పదని, వారి ఆవేదన చూస్తుంటే న్యాయం జరగకపోతే భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది అని ఆవేదనతో అరణ్యరోధనతో బాధపడుతున్నారు. ముఖ్యంగా ఎమ్మెల్యే, కార్పొరేటర్ కలిసి భరోసా ఇవ్వకపోతే స్థలాలు కొనే వాళ్ళు కాదని, ప్రస్తుతం హైడ్రా పేదలు నిర్మించుకున్న పిచుక గుళ్ళను జెసిబీ చక్రాల కింద నలిగిపోతుంటేవారి కన్నీళ్లతో ఆర్తనాదాలు చేస్తున్నారు. ఇంత తంతుగా జరుగుతున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్ రాకపోవడంతో సిగ్గు చేటు, గతంలో కొందరికి రిజిస్ట్రేషన్లు, మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేశారు. సర్కార్ ఇక్కడ ఉన్న పేద ప్రజలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి, అలాగే
బిఆర్ఎస్ పార్టీ బ్రోకర్లు వల్లే ఈ తతంగం జరిగింది కాబట్టి అవసరమైతే వాళ్ల ఇంటి ముందు ధర్నా చేస్తామని భాజపా సీనియర్ నాయకులు ఏనుగుల తిరుపతి అన్నారు. హస్మత్ పేట సర్వే నెంబర్ 1 లో ఉన్న నిరుపేదలకు న్యాయం జరిగే వరకు భాజపా నాయకులు అండగా ఉంటామని ఆయన ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.

## బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో ఘనంగా పీవీ నరసింహారావు జయంతి వేడుకలు



**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)** సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో ఆదివారం మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ పీవీ నరసింహారావు 105వ జయంతి వేడుకలను గజ్వేల్ డివిజన్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా గజ్వేల్ డివిజన్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య అధ్యక్షుడు శంకర్ శర్మ మాట్లాడుతూ, తెలంగాణ ముద్దుబిడ్డ పీవీ నరసింహారావు క్లిష్ట పరిస్థితుల్లో దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి భారత ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని అన్నారు. ఆధునిక భారత నిర్మాణానికి బలమైన పునాదులు వేసిన అపార మేధావి, బహుభాషా కోవిదుడు, దూరదృష్టి కలిగిన రాజనీతిజ్ఞుడిగా ఆయన దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. దేశ ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టడంలో, సంస్కరణలను అమలు చేయడంలో పీవీ నరసింహారావు చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొంటూ, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రవీందర్ రావు, కృష్ణమూర్తి, విశ్వేశ్వర్ శర్మ, నాగేందర్ రావు, శరత్ శర్మ, సాయికృష్ణ శర్మ, మోహన్ శర్మ, నిరంజన్ శర్మ, సంతోష్ శర్మ, సంతోష్ కుమార్, మధుసూదన్ రావు, మురళి, శ్రీనివాస్ శర్మ తదితరులు పాల్గొని పీవీ నరసింహారావుకు ఘన నివాళులర్పించారు.

## హై రిస్క్ ప్రాంతాల్లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని పరిశీలించిన జిల్లా వైద్య ఆరోగ్య అధికారి



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సంపత్, జిల్లా డేటా మేనేజర్ కార్తీక్ కలిసి ఆదివారం జిల్లాలోని హై రిస్క్ ప్రాంతాలు, గుడిసెలు, ఇటుక బట్టీలు వలస కార్మికులు నివసిస్తున్న ప్రాంతాలు, తాత్కాలిక నివాస ప్రాంతాలో పల్స్ పోలియో అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పోలియో బూత్‌ల వద్ద చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న తీరును పరిశీలించారు. బూత్‌ల వద్ద అందుబాటులో ఉన్న వ్యాక్సిన్ నిల్వలు, కోల్డ్ చైన్ నిర్వహణ, వ్యాక్సిన్ క్యారియర్లు, మార్కింగ్ విధానం, ట్యాలీ షీట్లు, నమోదు రిజిస్టర్లు, ఇతర రికార్డులను తనిఖీ చేసి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. అనంతరం చంద్రంపేట, రాజీవ్ నగర్ పరిసర ప్రాంతాల్లోని కుటుంబాలతో మాట్లాడారు. 15 మంది ఐదేళ్లలోపు చిన్నారులకు డీఎంహెచ్‌వో డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్ పల్స్ పోలియో చుక్కలు అందించారు. వైద్య బృందాలు పోలియో చుక్కలు వేస్తున్నాయని, మిగిలిపోయిన చిన్నారులను గుర్తించి తదుపరి రోజు నిర్వహించే హౌస్-టు-హౌస్ కార్యక్రమంలో తప్పనిసరిగా కవర్ చేస్తున్నామని తెలిపారు.

# అన్నపూర్ణ క్యాంటీన్లు పేరు గొప్ప, నిర్వహణ శూన్యం

- పేదల ఆకలి తీర్చాల్సిన కేంద్రాలు, పందికొక్కులు ఎలుకలకు నిలయాలా.?
- జీహెచ్ఎంసీ క్యాంటీన్లలో అధ్వాన్న పరిస్థితులు, అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం
- ఆహారం పెట్టి సిబ్బంది, తక్కువ అన్నం పెడుతున్నారని ప్రజల ఆరోపణలు
- ప్రభుత్వ ప్రచారానికి, క్షేత్రస్థాయి వాస్తవాలకు పొంతనే లేదు
- స్థానిక ఎమ్మెల్యేలు పట్టించుకోరా.? వాళ్లు బాధ్యత మరిచారా.?





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) పేదలకు గౌరవప్రదంగా, పరిశుభ్రమైన వాతావరణంలో తక్కువ ధరకు భోజనం అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన అన్నపూర్ణ క్యాంటీన్లు నేడు నిర్వహణ లోపాలతో విమర్శలకు కేంద్రంగా మారుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కోట్లాది రూపాయల ప్రజాధనం ఖర్చు చేస్తున్నప్పటికీ, అనేక క్యాంటీన్ లలో అపరిశుభ్రత, సమయపాలన లేకపోవడం, మౌలిక సదుపాయాల లోపాలు విషయంలో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తార్నాక చౌరస్తా లో ఉన్న అన్నపూర్ణ క్యాంటీన్ దుస్థితి అత్యంత అధ్వానంగా మారిందని సికింద్రాబాద్ నియోజకవర్గంలో ఉన్న క్యాంటీన్ లపై స్థానిక ఎమ్మెల్యే ఏ రోజు పట్టించుకున్న దాఖలాలు లేవు. కనీసం వాటి నిర్వహణ, చుట్టుపక్కల పరిశుభ్రత, పేదల భోజనాలకు సౌకర్యాలు, క్యాంటీన్ డబ్బాల పరిస్థితి పట్టించుకున్న పాపాన పోలేదని స్థానికులు మండిపడుతున్నారు. గ్రేటర్ హైదరాబాద్ లోనికొన్ని చోట్ల క్యాంటీన్ల పరిసరాల్లో ఎలుకలు, పందికొక్కులు సంచరిస్తున్నాయని క్యాంటీన్ డబ్బా లోపల చెత్తను సకాలంలో తొలగించకపోవడంతో అస్వచ్ఛ వాతావరణం నెలకొంటోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆహారం తీసుకునేందుకు వచ్చే పేద ప్రజలు ఇలాంటి పరిస్థితులను చూసి అసహనం వ్యక్తం చేస్తున్నారు.

### తాగునీరు కూడా భారమేనా.?

భోజనం అందిస్తున్నామని చెప్పే అధికారులు, తాగడానికి సరిపడా సురక్షితమైన నీటి సౌకర్యం కల్పించడంలో ఎందుకు విఫలమవుతున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. చేతులు కడుక్కునే పరిస్థితి లేదు. నీటి ప్యాకెట్లు ఇవ్వకపోవడం లేదా తగిన తాగునీటి ఏర్పాట్లు లేకపోవడం వల్ల భోజనానికి వచ్చిన ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఈ సమస్యలపై ప్రజా ప్రతినిధులు పట్టించుకున్న దాఖలాలు లేవు. క్యాంటీన్ లోపల ఆహారం పెట్టే సిబ్బంది అన్నం చాలా తక్కువ మోతాదులో పెడుతున్నారని అలా అన్నం మిగిల్చి మిగిలిన వారికి అమ్ముకొని సొమ్ము చేసుకుంటూ పేదల కడుపు కొడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనిపై అధికారుల పర్యవేక్షణ అసలు లేకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ప్రభుత్వం పెట్టే ఆహారం అందులో ఉన్న సిబ్బంది పేదలకు పూర్తిస్థాయిలో వడ్డించకుండా దాన్ని కూడా సొమ్ము చేసుకోవడం అంత దుర్మార్గం ఇంకోటి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### పాత డబ్బాలు, అపరిశుభ్రతకు నిలయాలు..

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న చాలా అన్నపూర్ణ క్యాంటీన్లలో ఆహారం వడ్డించే డబ్బాలు చాలా పాతబడిపోయి, దెబ్బతిన్న స్థితిలోనే ఉపయోగిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. కొత్త డబ్బాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్నప్పటికీ అధికారులు అసలు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పరిశుభ్రత విషయంలో రాజీ పడితే ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### సమయపాలన ఎక్కడ.?

పేద కార్మికులు, దినసరి కూలీలు నిర్ణీత సమయానికి భోజనం కోసం వస్తే, కొన్ని చోట్ల ఆలస్యంగా భోజనం సరఫరా జరుగుతుందని దానితో పాటు అందులో ఉన్న సిబ్బంది సైతం ఆలస్యంగా వడ్డిస్తున్నారని ఫిర్యాదులు ఉన్నాయి. దీంతో గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని వారు వాపోతున్నారు. ప్రజలకు సేవ చేయాల్సిన వ్యవస్థలో సమయపాలన కూడా లేకపోతే ఎలా అని ప్రశ్నిస్తున్నారు.

### పక్క రాష్ట్రాల నుంచి పాఠాలు నేర్చుకోవాలి

పక్క రాష్ట్రాల్లో ప్రజా క్యాంటీన్ల నిర్వహణ పరిశుభ్రంగా, క్రమబద్ధంగా ఉండగా, మన తెలంగాణ రాష్ట్రంలో మాత్రం నిర్వహణపై ఇంత నిర్లక్ష్యం ఎందుకని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మంచి విధానాలను అమలు చేసి అన్నపూర్ణ క్యాంటీన్లను ఆదర్శంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నార.

### ప్రచారానికే పరిమితమా.? సమస్యలు తీర్చారా.?



ప్రభుత్వం ఒకవైపు పేదల సంక్షేమం కోసం అన్నపూర్ణ క్యాంటీన్లను గొప్పగా ప్రచారం చేస్తుంటే, మరోవైపు క్షేత్రస్థాయిలో



కనిపిస్తున్న పరిస్థితులు మాత్రం ఆ ప్రచారానికి పూర్తి భిన్నంగా ఉన్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పేదలకు భోజనం పెట్టడం అంటే కేవలం అన్నం వడ్డించడం మాత్రమే కాదు, పరిశుభ్రమైన వాతావరణం, తాగునీటి సౌకర్యం, నాణ్యమైన సేవలు, గౌరవప్రదమైన నిర్వహణ కూడా అందించడం ప్రభుత్వ బాధ్యత, కానీ ఇక్కడ అసలు కనిపించకపోవడం పెద్ద సమస్యగా మారింది. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, పరిశుభ్రత, తాగునీరు, సమయపాలన, కొత్త సామగ్రి ఏర్పాటు వంటి అంశాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. లేకపోతే "అన్నపూర్ణ" అనే పేరుకు ఉన్న గౌరవం దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# లంచావతారాల పంజా.. అవినీతి రహిత తెలంగాణ సాధ్యమేనా.?

- ప్రభుత్వ శాఖల్లో భారీగా పెరుగుతున్న అవినీతి
- అటెండర్ నుండి ఐఏఎస్ స్థాయి వరకూ అవినీతి భాగోతం ఆరోపణలు
- ప్రజల్లో ఆందోళన, కఠిన చర్యలు, ప్రజల్లో చైతన్యమే పరిష్కారమంటున్న నిపుణులు

(గజ్జెల శ్రీనివాస్ --వేములవాడ ప్రశ్న న్యూస్)

తెలంగాణ రాష్ట్రంలో గత కొంతకాలంగా ప్రభుత్వ శాఖల్లో అవినీతి ఆరోపణలు, లంచాలు తీసుకుంటూ అధికారులు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి పట్టుబడుతున్న ఘటనలు వరుసగా వెలుగులోకి వస్తున్నాయి. ఈ పరిణామాలు రాష్ట్ర ప్రజల్లో తీవ్ర ఆందోళనకు దారితీస్తున్నాయి. ఒకటి రెండు శాఖలకు మాత్రమే పరిమితం కాకుండా రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్, విద్యుత్, పోలీసు, రవాణా, రిజిస్ట్రేషన్, వైద్య, విద్య తదితర అనేక శాఖల్లోనూ అటెండర్ నుండి మొదలుకొని ఐఏఎస్ స్థాయి అధికారుల వరకు లంచాల వ్యవహారాలు వెలుగుచూడటం ప్రజల్లో ప్రభుత్వ వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ సేవలు ప్రజలకు పారదర్శకంగా అందాల్సిన చోట కొంతమంది అధికారులు అక్రమ సంపాదన కోసం ప్రజలనే అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు తరచూ వినిపిస్తున్నాయి. సాధారణ ధ్రువపత్రం నుంచి పెద్ద మొత్తాల బిల్లుల చెల్లింపులు, భూ సంబంధిత అనుమతులు, టెండర్లు, సంక్షేమ పథకాల అమలు వరకు కొన్ని చోట్ల లంచాలు లేకుండా పనులు జరగడం లేదని ప్రజలు వాపోతున్నారు.

### కోట్లాది రూపాయల అక్రమ ఆస్తులు..

ఏసీబీ, విజిలెన్స్ అధికారులు నిర్వహించే దాడుల్లో కొంతమంది అధికారుల వద్ద కోట్లాది రూపాయల విలువైన స్థిర, చరాస్తులు, నగదు, బంగారం, విలాసవంతమైన భవనాలు, వ్యవసాయ భూములు, బినామీ ఆస్తులు బయటపడుతున్న ఘటనలు ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగిగా సాధారణ వేతనం పొందుతున్న వ్యక్తుల వద్ద ఇంత భారీ ఆస్తులు ఎలా వచ్చాయనే ప్రశ్నలు ప్రజల నుంచి వస్తున్నాయి. కేవలం లంచాలతోనే ఇంత భారీ స్థాయిలో అక్రమ సంపాదన వస్తుందని తెలుస్తోంది.

### విజిలెన్స్ వ్యవస్థపై ప్రశ్నలు..

ప్రభుత్వ శాఖల్లో అవినీతిని ముందుగానే గుర్తించి అరికట్టాల్సిన విజిలెన్స్ వ్యవస్థ కనీస స్థాయిలో పనిచేస్తుందా.? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత శాఖల్లో అంతర్గత పర్యవేక్షణ బలహీనంగా ఉండడం వల్లే కొందరు అధికారులు నిర్భయంగా అవినీతికి పాల్పడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. అవినీతి జరిగిన తర్వాత దాడులు చేయడం కంటే, జరగకుండా నిరోధించే వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. స్టేట్ విజిలెన్స్ అసలు విధులు ఏమాత్రం నిర్వహిస్తే లేదన్న విమర్శలు వస్తున్నాయి.

### లంచం తీసుకోవడమే కాదు.. ఇవ్వడమూ నేరమే..


అవినీతి నిరోధక చట్టాల ప్రకారం లంచం తీసుకోవడం మాత్రమే కాకుండా, లంచం ఇవ్వడం కూడా నేరమే. అయినప్పటికీ ఈ అంశంపై ప్రజల్లో సరైన అవగాహన లేదని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. పని త్వరగా పూర్తవుతుందనే ఉద్దేశంతో కొందరు స్వచ్ఛందంగానే లంచాలు ఇవ్వడం వల్ల అవినీతి మరింత పెరుగుతోందని వారు అంటున్నారు. ప్రజలు ఇవ్వకుంటే అధికారులు ఎందుకు తీసుకుంటారు. ప్రజలు తమ స్వార్థం కోసం ఇస్తూ అధికారులను అవినీతిపరులుగా మారుస్తున్నారు.

### ప్రజల్లో చైతన్యం అవసరం..

ప్రభుత్వం, అవినీతి నిరోధక శాఖ, విజిలెన్స్ విభాగాలు గ్రామ స్థాయి నుంచి పట్టణాల వరకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో "లంచం ఇవ్వవద్దు -- తీసుకోవద్దు" అనే సందేశాలు, ఫిర్యాదు హెల్ప్‌లైన్ నంబర్లు స్పష్టంగా ప్రదర్శించాలని సూచిస్తున్నారు. ఒక పని వద్ద అధికారి కావాలని ఆలస్యం చేస్తే ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడంతో కిందిస్థాయి అధికారులు అవినీతికి పాల్పడుతున్నారు.

### సాంకేతికతతో అవినీతికి చెక్..

నిపుణుల అభిప్రాయం ప్రకారం, ప్రభుత్వ సేవలను పూర్తిగా ఆన్‌లైన్ చేయడం, ఫైళ్ల కదలికను డిజిటల్ ట్రాకింగ్ ద్వారా




ప్రజలకు అందుబాటులో ఉంచడం, నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించడం, సేవలకు నిర్దిష్ట గడువులు అమలు చేయడం వంటి కఠిన చర్యలు అవినీతిని గణనీయంగా తగ్గించే అవకాశముంది. ప్రతి ప్రభుత్వ కార్యాలయాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఏసీబీ లేదా బిజినెస్ కార్యాలయంలో పార్టీ పర్యవేక్షణ జరగాలని సూచిస్తున్నారు.

### కఠిన చట్టాలపై ప్రజల డిమాండ్..

లంచాలు అడగాలన్నా, తీసుకోవాలన్నా అధికారులు భయపడేలా మరింత కఠిన చట్టాలు తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. అవినీతి నిరూపితమైన అధికారుల అక్రమ ఆస్తులను వెంటనే ప్రభుత్వం పూర్తిస్థాయిలో స్వాధీనం చేసుకోవడం, ఉద్యోగాల నుంచి శాశ్వతంగా తొలగించడం, వేగవంతమైన ప్రత్యేక కోర్టుల్లో విచారణ పూర్తి చేసి శిక్షలు అమలు చేయడం వంటి కఠిన చర్యలు చేపట్టాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

### అవినీతి రహిత సమాజం అందరి బాధ్యత..

అవినీతిని కేవలం ప్రభుత్వం లేదా ఏసీబీ మాత్రమే అరికట్టలేవని, ప్రజలు కూడా లంచాలకు వ్యతిరేకంగా నిలబడాల్సిన అవసరం ఉందని సామాజిక వేత్తలు సూచిస్తున్నారు. ఒకవైపు అధికారులు నిజాయితీగా విధులు నిర్వర్తించడం, మరోవైపు ప్రజలు లంచాలు ఇవ్వకుండా చట్టబద్ధ మార్గాల్లో ఫిర్యాదులు చేయడం ద్వారా మాత్రమే అవినీతి రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని వారు పేర్కొంటున్నారు.

# ముందు మీ చరిత్రేంటో చూసుకోండి

### - అఖిలేశ్ యాదవ్ కు సీఎం యోగి ఆదిత్యనాథ్ కౌంటర్



లక్నో (ప్రశ్న న్యూస్) సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధినేత అఖిలేశ్ యాదవ్ అయోధ్యపై చేసిన వ్యాఖ్యలపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రామభక్తులపై కాల్పులు జరిపిన చరిత్ర ఉన్న ఎస్పీ, అయోధ్యను పవిత్ర నగరంగా ఎలా తీర్చిదిద్దుతుందని ఆయన ప్రశ్నించారు. హిందూ మత సంప్రదాయాలను వ్యతిరేకించడమే ఎస్పీ నైజమని, ఆ పార్టీకి ఆలయ నగరి అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదని యోగి ఆరోపించారు. అయోధ్య విరాళాల్లో అవినీతిపై స్పందిస్తూ, తాము అధికారంలోకి వస్తే, ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులు అసలైన ఆధ్యాత్మికతను అనుభవించేలా అయోధ్యను అద్వితీయమైన, సాటిలేని పవిత్ర నగరంగా అభివృద్ధి చేస్తామని అఖిలేశ్ యాదవ్ శనివారం 'ఎక్స్' వేదికగా ఒక ప్రకటన చేశారు. ఈ నేపథ్యంలో, హత్రాస్‌లో రూ.548 కోట్ల విలువైన 143 అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన అనంతరం యోగి మాట్లాడుతూ అఖిలేశ్ పై విమర్శలు గుప్పించారు. "నిన్న అఖిలేశ్ యాదవ్ ప్రకటన చూసి ఆశ్చర్యపోయాను. ఆయన ప్రభుత్వం వస్తే అయోధ్యను పవిత్ర నగరంగా చేస్తారట. మీరు ఏం పవిత్ర నగరం కడతారు? ముందు మీ చరిత్ర చూసుకోండి. రామభక్తులపై కాల్పులు జరిపించింది మీరే కదా?" అని యోగి నిలదీశారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో, రామభక్తుల కృషి ఫలితంగా అయోధ్య నేడు తన పూర్వ వైభవాన్ని సంతరించుకుని 'త్రేతాయుగాన్ని' గుర్తుచేస్తోందని యోగి అన్నారు. ఈ అభివృద్ధిని చూసి ఇప్పుడు మీకు కూడా ఆశ కలుగుతోందని ఎద్దేవా చేశారు. గతంలో ఎస్పీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పోలీస్ స్టేషన్లు, జైళ్లలో కృష్ణాష్టమి వేడుకలను నిలిపివేసిందని, కన్వర్ యాత్రపై ఆంక్షలు విధించిందని యోగి ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిస్థితులు మారాయని యోగి తెలిపారు. "ఈ రోజు హత్రాస్‌లో 22కు పైగా ఆలయాలను సుందరీకరించామని మా ప్రతినిధులు చెబుతున్నారు. ఇది ఎస్పీ హయాంలో సాధ్యమయ్యేదా? అప్పుడు ఈ డబ్బు శ్మశాన వాటికల గోడల నిర్మాణానికి వెళ్లేది. మేము ఆ డబ్బును ఆలయాల అభివృద్ధి వైపు మళ్లించాం" అని ఆయన స్పష్టం చేశారు. అయోధ్యలో మార్పులను స్వయంగా చూసి తెలుసుకోవాలని, ఒక్కసారైనా రామ్‌లల్లాను దర్శించుకోవాలని ప్రతిపక్ష నేతలకు ఆయన సూచించారు. కేవలం అయోధ్యే కాకుండా, మధుర, బృందావనంపైనా అఖిలేశ్ తన వైఖరి స్పష్టం చేయాలని యోగి సవాల్ విసిరారు. "మీకు నిజంగా ఆధ్యాత్మికతపై నమ్మకం ఉంటే, మధుర, బృందావనం, శ్రీకృష్ణ జన్మభూమి గురించి బహిరంగంగా మాట్లాడండి. శ్రీకృష్ణుడి జన్మస్థలాన్ని కూడా గౌరవించాలి" అని అన్నారు. ముల్లాల, మౌల్వీల ముందు మోకరిల్లడం తప్ప సమాజ్‌వాదీ పార్టీకి మరో అభివృద్ధి ఎజెండా లేదని, అభివృద్ధిపై దుమ్ము చల్లే ప్రయత్నం చేయవద్దని యోగి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అయోధ్య, మధుర, కాశీ వంటి పుణ్యక్షేత్రాలలో యాత్రికుల సౌకర్యాలను మెరుగుపరచడానికి తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఆయన వివరించారు.

# అమెరికాలో ఆకస్మిక వరదలు

### - ఏపీ యువకుడు గల్లంతు



అమరావతి (ప్రశ్న న్యూస్) అమెరికాలో జరిగిన ఓ దురదృష్టకర సంఘటనలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యువకుడు గల్లంతయ్యాడు. బాపట్ల జిల్లాకు చెందిన దొప్పలపూడి వెంకటేశ్, కాన్సాస్‌లో సంభవించిన ఆకస్మిక వరదల్లో కొట్టుకుపోయినట్లు అక్కడి నుంచి వస్తున్న సమాచారం ఆందోళన కలిగిస్తోంది. వివరాల్లోకి వెళ్తే, బాపట్ల జిల్లా పరుచూరు మండలం దేవరపల్లి గ్రామానికి చెందిన దొప్పలపూడి రాంబాబు కుమారుడైన వెంకటేశ్, అమెరికాలోని నెబ్రాస్కా రాష్ట్రం ఒమాహాలో నివసిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం కాన్సాస్‌లోని సమ్నర్ కౌంటీ వెల్లింగ్టన్ ప్రాంతంలో కారులో ప్రయాణిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. భారీ వర్షాల కారణంగా ఎస్. ఆలివర్ రోడ్ సమీపంలో ఒక్కసారిగా వచ్చిన వరద ప్రవాహంలో అతడి కారు కొట్టుకుపోయింది. అప్పటి నుంచి వెంకటేశ్ ఆచూకీ లభించలేదు. ఈ విషయం తెలియడంతో వెంకటేశ్ కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. స్థానిక పరుచూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఈ ఘటనపై వెంటనే స్పందించారు. వెంకటేశ్ ఆచూకీ కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేయాలని కోరుతూ కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌కు ఆయన లేఖలు రాశారు. అమెరికా అధికారులతో సమన్వయం చేసుకొని సహాయక చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం అమెరికా అధికారులు వెంకటేశ్ కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. అతడి ఆచూకీకి సంబంధించి తదుపరి సమాచారం కోసం కుటుంబ సభ్యులు, అధికారులు ఎదురుచూస్తున్నారు.

# మళ్లీ భగ్గుమన్న పశ్చిమాసియా

### - బహ్రెయిన్, కువైట్ లను టార్గెట్ చేసిన ఇరాన్



టెహ్రాన్ (ప్రశ్న న్యూస్) పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. కువైట్, బహ్రెయిన్‌లలో ఉన్న అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసింది. కువైట్‌లోని అలీ అల్ సేలం ఎయిర్‌బేస్, బహ్రెయిన్‌లోని పోర్ట్ సల్మాన్‌లో ఉన్న అమెరికా ఫిఫ్త్ ఫ్లీట్‌పై ఈ దాడులు జరిగినట్లు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ధృవీకరించింది. ఒక రోజు క్రితం అమెరికా తమ భూభాగంలోని ఐదు ప్రాంతాలపై దాడులు జరిపిందని, దానికి ప్రతీకారంగానే ఈ చర్యలు తీసుకున్నామని ఇరాన్ స్పష్టం చేసింది. హోర్ముజ్ జలసంధి సమీపంలో చమురు ట్యాంకర్‌పై ఇరాన్ డ్రోన్ దాడికి పాల్పడటంతో అమెరికా ప్రతీకార చర్యలు ప్రారంభించింది. ఈ దాడులు, ప్రతిదాడుల పరంపరతో ఇరు దేశాల మధ్య జూన్ 17న కుదిరిన 60 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం పూర్తిగా నీరుగారిపోయింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించేందుకు పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో ఈ ఒప్పందం కుదిరింది. కానీ, తాజా పరిణామాలతో శాంతి ప్రయత్నాలకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది.

ఈ దాడులను కువైట్, బహ్రెయిన్ తీవ్రంగా ఖండించాయి. తమ సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశాయి. మరోవైపు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర స్వరంతో స్పందించారు. ఇరాన్ కనుక ఒప్పందాలను ఉల్లంఘిస్తూ దాడులకు పాల్పడితే, ఆ దేశం "ఇకపై ఉనికిలో ఉండదు" అని తీవ్రంగా హెచ్చరించారు. ఇరాన్ విదేశాంగ శాఖ మాత్రం అమెరికాయే ఒప్పందాన్ని ఉల్లంఘించిందని, తమ సార్వభౌమత్వాన్ని కాపాడుకుంటామని తేల్చి చెప్పింది. ఖతార్, యూఏఈ, జోర్డాన్ వంటి దేశాలు ఇరుపక్షాలు సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేశాయి. ఈ దాడుల్లో అమెరికా సిబ్బందికి ఎలాంటి నష్టం జరగలేదని ప్రాథమిక సమాచారం. అయితే, బహ్రెయిన్‌లో ఓ నివాస భవనం దెబ్బతినడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588